# ప్రజాశక్తి

మంగళవారం 12 డిసెంబరు 2023 | 8 పేజీలు

ఎన్‌టిఆర్

కృష్ణా

సమావేశంలో మాట్లాడుతున్న మంత్రి జోగి రమేష్; చిత్రంలో ఎంఎల్‌ఎలు పేర్ని, కొడాలి, సింహాద్రి, వంశీ

# రంగుమారిన ధాన్యాన్నీ కొంటాం

**❀మంత్రి జోగి రమేష్ ❀తుపాను నష్టంపై ఎంఎల్‌ఎలతో సమీక్ష**

**ప్రజాశక్తి - కృష్ణా ప్రతినిధి**

తుపాను ధాటికి పంటలు తీవ్రంగా దెబ్బతిన్న రైతులకు ప్రభుత్వం అండగా నిలుస్తుందని మంత్రి జోగి రమేష్ తెలిపారు. తుపాను ప్రభావంగా కురిసిన భారీ వర్షాలకు తడిసి రంగుమారిన, నూకశాతం, తేమశాతం ఎక్కువ ఉన్న ధాన్యాన్ని రైతుల నుంచి పూర్తి స్థాయిలో కొనుగోలు చేస్తామని చెప్పారు. తుపాను ప్రభావం, ధాన్యం సేకరణలపై మచిలీపట్నం కలెక్టరేట్ స్పందన హాలులో జిల్లాలోని ఎంఎల్‌ఎలతో కలిసి మంత్రి సమీక్ష నిర్వహించారు. అనంతరం జోగి రమేష్ మీడియాతో మాట్లాడుతూ ఇప్పటి వరకు 25 శాతం ధాన్యం కొనుగోలు చేశామన్నారు. గత ప్రభుత్వ హయాంలో తుపాను వచ్చిన వారానికో పదిరోజులకో పంటలను పరిశీలించేవారని, ఇప్పుడు ఆ పరిస్థితి లేదని అన్నారు. అధికారులు వెంటనే పరిశీలన జరుపుతున్నారని అన్నారు. తాము కూడా క్షేత్రస్థాయిలో పర్యటించి రైతులకు భరోసా ఇచ్చామన్నారు. జరిగిన నష్టాన్ని వివరించడానికి తనతోపాటు జిల్లాలోని ఇతర ఎంఎల్‌ఎలు ముఖ్యమంత్రిని కలుస్తున్నట్లు తెలిపారు. ఈ సమీక్షా సమావేశంలో మంత్రితోపాటు మచిలీపట్నం, గుడివాడ, అవనిగడ్డ, గన్నవరం ఎంఎల్‌ఎలు పేర్ని వెంకట్రామయ్య (నాని), కొడాలి శ్రీ వెంకటేశ్వరరావు(నాని), సింహాద్రి రమేష్, వల్లభనేని వంశీమోహన్, జిల్లా వ్యవసాయ సలహా మండలి చైర్మన్ రాఘవరావు, పౌర సరఫరా సంస్థ జిల్లా ఇన్చార్జి మేనేజర్, ఉయ్యూరు ఆర్‌డిఒ డి.రాజు, జిల్లా వ్యవసాయ అధికారి ఎన్.పద్మావతి, మార్కెటింగ్ ఎడి నిత్యానందం, డిఎస్‌ఓ పార్వతి, డిసిఒ ఫణి కుమార్, బందరు, గుడివాడ ఆర్‌డిఒలు ఎం.వాణి, పద్మావతి తదితరులు పాల్గొన్నారు.

**ఓటరు జాబితాల్లో లోపాలు సవరించాలి**

**కలెక్టర్‌కు ఎంఎల్‌ఎలు పేర్ని, కొడాలి వినతి**

ఓటరు జాబితాల్లోని లోపాలు సవరించాలని జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ పి.రాజాబాబుకు మాజీ మంత్రులు, మచిలీపట్నం, గుడివాడ ఎంఎల్‌ఎలు పేర్ని వెంకట్రామయ్య (నాని), కొడాలి శ్రీ వెంకటేశ్వరరావు(నాని) విజ్ఞప్తి చేశారు. ఈ మేరకు సోమవారం కలెక్టర్‌ను కలిసి వినతిపత్రం సమర్పించారు. (మిగతా 6లో)

# భారీగా మూతపడ్డ సర్కారీ స్కూళ్లు

**❀నాలుగేళ్లలో 130 పాఠశాలలు మూత**

**❀అత్యధికంగా విజయవాడ అర్బన్‌లో 43**

**ప్రజాశక్తి - విజయవాడ ప్రతినిధి**

ప్రభుత్వ పాఠశాలలపై ప్రభుత్వ నిర్ణయాలు గొడ్డలిపెట్టుగా మారాయి. దీంతో ఎన్టీఆర్ జిల్లా పరిధిలో వందలాది ప్రభుత్వ పాఠశాలలు మూతపడ్డాయి. వైఎస్ఆర్ కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన నాటి నుంచి నుంచి ఇప్పటి వరకు ప్రభుత్వ 130 పాఠశాలలను మూసివేశారు. ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి విద్యా రంగంలో తీసుకొచ్చిన అనేక మార్పుల కారణంగా వీటిని మూసివేయాల్సిన పరిస్థితి నెలకొంది. వీటిలో మండల పరిషత్ పాఠశాలలతో పాటు ఎయిడెడ్, ఎన్‌సిఎల్పీ స్కూళ్లు, మదరసాలు కూడా ఉన్నాయి. అత్యధికంగా ఎయిడెడ్ పాఠశాలలు ఉన్నాయి. 110 ఎయిడెడ్ స్కూళ్లు ఉండగా, 9 మండల పరిషత్ స్కూళ్లు, 9 ఎన్‌సిఎల్పీ స్కూళ్లు, 2 మదరసాలు ఉన్నాయి. దీంతో వేలాది మంది పేద, మధ్య తరగతి పిల్లలు ఆర్థిక భారమైనా ప్రైవేటు పాఠశాలలను ఆశ్రయించాల్సి వచ్చింది. మూత పడిన వాటిల్లో ఏళ్ల తరబడి చరిత్ర కలిగిన మాంటిస్సోరి, పోసాని నరసింహారావు పాఠశాలలు కూడా ఉన్నాయి. మాంటిస్సోరి పాఠశాల ఆరున్నర దశాబ్దాలకుపైగా చరిత్ర కలిగింది. వి.కోటేశ్వరమ్మ దీని వ్యవస్థాపకురాలు. 1954లో మాంటిస్సోరి పాఠశాలను కోటేశ్వరమ్మ ప్రారంభించారు. బాలికల విద్యను ప్రోత్సహించే లక్ష్యంతో దీనిని నెలకొల్పారు. విద్యా రంగంలో విశిష్ట సేవలు అందించినందుకు కోటేశ్వరమ్మకు 92ఏళ్ల వయసులో 2017లో కేంద్ర ప్రభుత్వం పద్మశ్రీ పురస్కారం కూడా అందించారు. విజయవాడ శివారు ప్రాంతమైన గొల్లపూడిలో పోసాని నరసింహారావు చౌదరి పాఠశాల 1964 ఆగస్టులో స్థాపించారు. విజయవాడలోని పురాతన పాఠశాలల్లో ఇదొకటి. 2.8 ఎకరాల స్థలంలో రూ.2.25 లక్షల వ్యయంతో నిర్మించిన ఈ పాఠశాల భవనాన్ని 1968లో నాటి ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి కాసు బ్రహ్మానంద రెడ్డి ప్రారంభించారు. ఈ పాఠశాల కింద ఉన్న 7.02 ఎకరాల పొలాన్ని విద్యా శాఖతోపాటు దేవాదాయ శాఖకు ప్రభుత్వం అప్పగించింది. ప్రపంచ బ్యాంకు రుణం కోసం మానవ వనరుల వ్యయాన్ని తగ్గించాలనే ఉద్దేశంలో భాగంగా ఉపాధ్యాయుల సంఖ్య తగ్గించాలని నిర్ణయించడం, జాతీయ విద్యా విధానంలో భాగంగా పాఠశాలల విలీనం చేపట్టడంతో పాఠశాలలను మూసివేశారు. అంతేకాకుండా విద్యాహక్కు చట్టాన్ని సైతం సవరణ చేసి కిలోమీరు దూరంలో ఉండాల్సిన 3, 4, 5 తరగతులను మూడు కిమీ దూరం వరకు ఉండేలా సవరించడం, ఏళ్ల తరబడి చదువులు చెప్పిన ఎయిడెడ్ పాఠశాలలకు ఎయిడ్ లేకుండా చేయడంతో ఈ పాఠశాలలు మూతపడ్డాయని విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. మండలాల వారీగా మూతపడిన పాఠశాలలను పరిశీలిస్తే...విజయవాడ అర్బన్‌తోపాటు జి.కొండూరు, ఇబ్రహీంపట్నం, నందిగామ మండలాల్లో అధికంగాను, ఏకొండూరు మండలంలో తక్కువ సంఖ్యలో మూత పడ్డాయి. ఏకొండూరు మండలంలో ఒక ఎయిడెడ్ పాఠశాల, చందర్లపాడులో ఒక ఎంపిపి, 3 ఎయిడెడ్ కలిపి 4 పాఠశాలలను మూసివేశారు. జికొండూరు మండలంలో ఒక ఎంపిపి, 9ఎయిడెడ్‌తో కలిపి 10 పాఠశాలలకు తాళం వేశారు. గంపలగూడెం పరిధిలో 2ఎంపిపి, 1ఎయిడెడ్‌తో కలిపి 3, ఇబ్రహీంపట్నం పరిధిలో 10 ఎయిడెడ్ పాఠశాలలు, జగ్గయ్యపేట మండలంలో 6 ఎయిడెడ్, 1 ఎన్‌సిఎల్పీ స్కూలు కలిపి 7 స్కూళ్లను క్లోజ్ చేశారు. కంచికచర్లలో ఒక ఎంపిపి, 4ఎయిడెడ్, నందిగామలో 10 ఎయిడెడ్, రెడ్డిగూడెంలో 2ఎయిడెడ్, తిరూరువూరులో 1ఎంపిపి, 5ఎయిడెడ్ పాఠశాలలను మూసివేశారు. వత్సవాయిలో 6ఎయిడెడ్, వీరుల్లపాడులో 2ఎంపిపి, 4ఎయిడెడ్, విజయవాడ రూరల్‌లో 7ఎయిడెడ్, విస్సన్నపేటలో 1ఎంపిపి, 6ఎయిడెడ్, విజయవాడ అర్బన్‌లో 34ఎయిడెడ్, 7ఎన్‌సిఎల్పీ, 2 మదరసాలతో కలిపి మొత్తం 43 పాఠశాలలను మూసివేశారు.

విజయవాడలో మూతపడిన మాంటిస్సోరి పాఠశాల

రొయ్యూరులో దెబ్బతిన్న పంటలను పరిశీలిస్తున్న రుద్రరాజు తదితరులు

# వాణిజ్య పంటలకూ నష్టపరిహారం

**పిసిసి అధ్యక్షులు గిడుగు రుద్రరాజు డిమాండ్**

**ప్రజాశక్తి - తోట్లవల్లూరు :** మిచౌంగ్ తుపాను కారణంగా రాష్ట్రంలో అనేక మంది రైతుల పంటలు దెబ్బతిన్నాయని, వరితోపాటు అరటి, తమలపాకు తోటలు కూడా పూర్తిగా నాశనమై రైతులు నష్టపోయారని ఎపి పిసిసి అధ్యక్షులు గిడుగు రుద్రరాజు అన్నారు. అందువల్ల వాణిజ్య పంటల నష్టాన్ని కూడా ఎన్యుమరేషన్ చేసి నష్టపరిహారం అందించాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. కృష్ణాజిల్లా తోట్లవల్లూరు మండలం రొయ్యూరులో దెబ్బతిన్న అరటి, తమలపాకు పంటలను సోమవారం రుద్రరాజు నేతృత్వం లోని కాంగ్రెస్ బృందం పరిశీలించింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అరటి పంటకు ఎకరాకు లక్షన్నర, తమలపాకు తోటలకు లక్ష రూపాయల చొప్పున పరిహారం అందించాలని డిమాండ్ చేశారు. బాధిత రైతులకు ఇన్‌పుట్ సబ్సిడీ ఇవ్వాలని, ఉచితంగా విత్తనాలు పంపిణీ చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో పిసిసి ఉపాధ్యక్షులు ధనేకుల మురళీమోహన్, గొల్లు కష్ణ, ప్రధాన కార్యదర్శి మొవ్వ మోహన్ రావు, విజయవాడ సిటీ కాంగ్రెస్ అధ్యక్షులు నరహరిశెట్టి నరసింహా రావు, గన్నే కోటేశ్వర రావు, వల్లభనేని చెన్నయ్య పాల్గొన్నారు.

మచిలీపట్నంలో జరిగిన కార్యక్రమంలో కలెక్టర్ రాజాబాబు తదితరులు

# పేదలకు న్యాయం అందించాలి

**●లా నేస్తం జమలో కృష్ణా కలెక్టర్ రాజాబాబు, ఎన్‌టిఆర్ జెసి సంపత్ కుమార్**

**ప్రజాశక్తి - కలెక్టరేట్ (కృష్ణా), విజయవాడ :** సమాజంలో న్యాయవాద వత్తి ద్వారా పేదలకు న్యాయం అందించాలనే ప్రభుత్వ లక్ష్యానికి అనుగుణంగా న్యాయవాదులు కషి చేయాలని కృష్ణాజిల్లా కలెక్టర్ పి.రాజాబాబు, ఎన్‌టిఆర్ జిల్లా జాయింట్ కలెక్టర్ డాక్టర్ పి.సంపత్ కుమార్ అన్నారు. వైయస్సార్ లా నేస్తం పథకం కింద రెండో విడతగా సోమవారం రాష్ట్ర ముఖ్యమంత్రి వైయస్ జగన్మోహన్ రెడ్డి తాడేపల్లి క్యాంపు కార్యాలయం నుండి బటన్ నొక్కి లబ్ధిదారుల ఖాతాల్లో ఆర్థిక సాయం జమ చేశారు. ఈ కార్యక్రమాన్ని వర్చువల్ విధానం ద్వారా మచిలీపట్నం, విజయవాడ కలెక్టరేట్లలోని వీడియో కాన్ఫరెన్స్ హాల్ నుండి న్యాయవాదులు, అధికారులు వీక్షించారు. ఈ సందర్భంగా మచిలీపట్నం కలెక్టరేట్లో కలెక్టర్ రాజాబాబు మాట్లాడుతూ గ్రాడ్యుయేషన్ పూర్తిచేసిన యువ లాయర్లు తమ వత్తిలో నిలదొక్కుకునేలా వైయస్సార్ లా నేస్తం పథకం కింద నెలకు రూ.5 వేల చొప్పున మూడేళ్లపాటు ఒక్కొక్కరికి ఏడాదికి రూ.60 వేలు, మూడేళ్లకు మొత్తం రూ.1.80 లక్షలు ప్రభుత్వం ఇస్తోందన్నారు. ఏడాదికి రెండుసార్లు నిధులు వారి ఖాతాల్లో జమ చేస్తోందన్నారు. కష్ణాజిల్లాలో ఈ ఏడాది 2023 - 24 సంవత్సరానికి సంబంధించి రెండో విడత 6 నెలలకుగాను అర్హులైన 108 మందికి రూ.32.40 లక్షలు వారి బ్యాంకు ఖాతాల్లో జమ చేసినట్లు చెప్పారు. ఈ కార్యక్రమంలో జెసి డాక్టర్ అపరాజితా సింగ్, మచిలీపట్నం మేయర్ చిటికెన వెంకటేశ్వరమ్మ, డిప్యూటీ మేయర్ శీలం భారతి, మచిలీపట్నం బార్ అసోసియేషన్ అధ్యక్షులు తుంగల హరిబాబు, లీగల్ సెల్ కన్వీనర్ పల్లపాటి అంకరాజు, అడ్వకేట్ బండారి వెంకటేశ్వరరావు, కలెక్టరేట్ అడ్మినిస్ట్రేటివ్ అధికారిణి రాధిక, డిప్యూటీ తహశీల్దారు పి.వి.నాంచారమ్మ పాల్గొన్నారు. విజయవాడలోని ఎన్‌టిఆర్ జిల్లా కలెక్టరేట్లో జెసి సంపత్ కుమార్ మాట్లాడుతూ 184 మందికి రూ.46 లక్షల లబ్ధి చేకూర్చినట్లు తెలిపారు. వీరిలో బీసీలు 64 మంది, ఓసీలు 59 మంది, ఎస్‌సీలు 48 మంది, ఎస్‌టీలు 13 మంది ఉన్నట్లు వివరించారు. ఈ కార్యక్రమంలో ఏపీ విశ్వబ్రాహ్మణ కార్పొరేషన్ చైర్మన్ తోలేటి శ్రీకాంత్, ఏపీ భట్రాజ కార్పొరేషన్ చైర్పర్సన్ కూరపాటి గీతాంజలి, లిడ్‌క్యాప్ డైరెక్టర్ ఝాన్సీరాణి, లీగల్ సెల్ ప్రతినిధులు బి.నాగార్జునరావు, ఎం.విఠల్‌రావు, న్యాయవాదులు అబ్రహాం లింకన్, బి.సుధీర్ తదితరులు పాల్గొన్నారు.

విజయవాడలో జరిగిన కార్యక్రమంలో జెసి సంపత్‌కుమార్ తదితరులు

## 203 మందికి కళ్ళజోళ్లు పంపిణీ

**ప్రజాశక్తి - రెడ్డిగూడెం :** రెడ్డిగూడెం పిఏసిఎస్ అధ్యక్షులు బత్తుల శ్రీనివాస్ రెడ్డి ఆధ్వ ర్యంలో ఃసోమవారం 203 మందికి కళ్లజోళ్లు పంపిణీ చేశారు. వారం క్రితం ఉచిత కంటి వైద్య శిబిరం ఏర్పాటు చేసి 250 మందికి కంటి పరీక్షలు నిర్వహించారు. ఆపరేషన్ అనంతరం కళ్లజోళ్లు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో వైసిపి సీనియర్ నాయకులు రెడ్డిగూడెం మండల జడ్పీటీసీ సభ్యులు పాలంకి విజయభాస్కర్ రెడ్డి, మండల పార్టీ అధ్యక్షులు బోలగాని తిరుపతి రావు, మండల సచివాలయాల కన్వీనర్ ఉయ్యూరు భరత్ కుమార్ రెడ్డి, మండల వ్యవసాయ సలహా మండలి అధ్యక్షులు బత్తుల వెంకటేశ్వర రెడ్డి (పెదబాబు) తదితరులు పాల్గొన్నారు.

## ధాన్యం కొనుగోలు కేంద్రం ప్రారంభం

**ప్రజాశక్తి - రెడ్డిగూడెం :** మండల పరిధిలోని ముచ్చన పల్లి గ్రామంలో ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని సోమవారం జెడ్పీటీసీ సభ్యులు పాలంకి విజయ భాస్కర్ రెడ్డి ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ సిఎం జగన్ ఆదేశాలతో తేమశాతం ఎక్కువ ఉన్నా కూడా ధాన్యం కొనుగోలు చేస్తున్నామని, రంగు మారిన ధాన్యం కూడా కొనుగోలు చేయనున్నట్లు తెలిపారు. ఈ క్రాప్‌లో నమోదు అయి ఉండి ఇకెవైసి చేయించుకున్నా పడిపోయిన వరి పంటను వ్యవసాయ శాఖ అధికారులు పరిశీలించి నష్టపరిహారం అందజేయనున్నట్లు తెలిపారు. రైతులు ఎవరూ అధైర్య పడొద్దని ప్రతి ఒక్కరు ఈ అవకాశాన్ని సద్వినియోగపరుచుకోవాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో సీనియర్ నాయకులు మద్దిరెడ్డి జమాలారెడ్డి, శ్రీరాంపురం సొసైటీ అధ్యక్షులు నాదెళ్ల చెన్నకేశవరావు (కేశిబాబు), పగిడిపల్లి శ్రీనివాసరావు, కిలారి సురేష్, మద్దిరెడ్డి రాజా రెడ్డి, మట్టా తిరుపతిరావు, సివిల్ సప్లై టెక్నికల్ అసిస్టెంట్ వీరమళ్ల ధనలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

## తాతగుంట్లలో వైసిపి కార్యక్రమం

జెండా ఆవిష్కరిస్తున్న దృశ్యం

**ప్రజాశక్తి - విసన్నపేట :** 29 కోట్లకు పైగా ఈ నాలుగు సంవత్సరాల కాలంలో తాతగుంట్ల గ్రామ సంక్షేమానికి కేటాయించినట్లు పంచా యతీ అధికారులు తెలిపారు. సోమవారం పల్లెకు పోదాం కార్యక్రమం తాతగుంట్లలో నిర్వహించారు. ఈ సందర్భంగా గ్రామ సర్పంచ్ ప్రొద్దుటూరు వెంకటేశ్వరరావు, ఎంపిటిసి మేడ తిరుపతిరావు హాజరై మాట్లాడారు. ఏపీకి సీఎం జగనే ఎందుకు కావాలి కార్యక్రమంలో భాగంగా మండల జేసీఎస్ అనుమోలు శివ బాజీ ఆధ్వర్యంలో జండా ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో గ్రామ పార్టీ అధ్యక్షులు షేక్ కాలేషా, మండల మైనార్టీ సెల్ అధ్యక్షులు మహమ్మద్ దస్తగిరి, సచివాలయం కన్వీనర్ మేడ ప్రసాద్, మేడ శ్రీనివాసరావు, పార్టీ కార్యకర్తలు కోలేటి పాపారావు, జీత్య ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు. **నందిగామ :** రాఘవాపురం – నరసింహారావు పాలెంలి గ్రామాల్లో సోమవారం రాత్రి "పల్లె కు పోదాం" కార్యక్రమాలలో నందిగామ ఎంఎల్ఎ మొండితోక జగన్ మోహన్ రావు పాల్గొన్నారు. పేద, బలహీన వర్గాల సంక్షేమం కోసం, ఏ రాష్ట్రంలోనూ అమలు చేయని విధంగా జగనన్న ప్రభుత్వం అనేక సంక్షేమ పథకాలను అమలు చేస్తూ ఆదర్శ రాష్ట్రంగా నిలిచిందని ఎంఎల్ఎ పేర్కొన్నారు.2014లో టీడీపీ, జనసేన, బీజేపీలతో కలిసి ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీలు.. అధికారంలోకి వచ్చిన తర్వాత అమలు చేయని విషయాలను ప్రజలకు వివరించారు.

## ఆస్పత్రికి క్షతగాత్రుల తరలింపు

**ప్రజాశక్తి - జగ్గయ్యపేట:** ఆటో బోల్తాపడి తీవ్ర గాయాలపాలైన బాధితులను నియోజకవర్గ టిడిపి ఇన్‌ఛార్జి శ్రీరాం రాజగోపాల్ జగ్గయ్యపేట ప్రభుత్వాస్పత్రికి తరలించారు. వివరాల ప్రకారం... తెలంగాణ రాష్ట్రం నల్గొండ జిల్లా దివేలి మండలంలోని కాటన్నగర్‌కు చెందిన గురుగుంట్ల గణేష్, అశ్విని, రామారావు ఆటోలో విజయవాడ వెళ్తున్నారు. మార్గమధ్యలో అనుమంచిపల్లి, షేర్ మహ్మద్ పేట గ్రామాల మధ్య ఆటో బోల్తా పడి ప్రయాణికులు తీవ్ర గాయాల పాలయ్యారు. ఇదే సమయంలో తక్కెళ్ళపాడులో ఒక వివాహ వేడుకకు హాజరై తిరిగి జగ్గయ్యపేట వస్తున్న శ్రీరామ్ తన కారులో క్షతగాత్రులను ఎక్కించుకుని ఆస్పత్రికి తరలించారు. బాధితులకు ప్రథమ చికిత్స చేయించి ఆహారం, దుస్తులను అందజేశారు.

## పౌల్ట్రీ ఫారం నిలిపివేయాలని వినతి

ర్యాలీగా వెళ్తున్న గ్రామస్తులు

తహశీల్దార్ కార్యాలయం వద్ద పోలీస్ బందోబస్తు

**ప్రజాశక్తి - విస్సన్నపేట :** మండలంలోని వేమిరెడ్డిపల్లి పంచాయతీలోని నర్మదానగర గ్రామంలో నిర్మిస్తున్న స్నేహ పౌల్ట్రీఫార్మ్‌ని నిలిపివేయాలని గ్రామస్తులు అధికారులకు వినతిపత్రం అందజేశారు. సోమవారం ఈ మేరకు గ్రామస్తులంతా కలిసి కాలినడకన బయల్దేరి విస్సన్నపేటలోని అంబేద్కర్ విగ్రహానికి నివాళులర్పించారు. అనంతరం ర్యాలీగా వెళ్లి తహశీల్దార్ కార్యాలయాన్ని ముట్టడించారు. స్పందన కార్యక్రమంలో తహశీల్దార్‌కు, ఎంపిడిఒకు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా అధ్యక్షులు విస్సంపల్లి నాగరాజు మాట్లాడుతూ రెండు నెలల నుండి ఈ ఫారం నిర్మాణం వల్ల వచ్చే అనారోగ్య సమస్యల గురించి అధికారులకు ఏకరవు పెట్టినా పట్టించుకోవడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. ఈ పౌల్ట్రీ ఫారం దాదాపు 250 కోట్లతో నిర్మితమవుతుందని పైస్థాయి నాయకుల నుండి కింద స్థాయి నాయకుల వరకు ఈ నిర్మాణానికి మద్దతు ఉందని అన్నారు. వెంటనే గ్రామపంచాయితీ ఇచ్చిన నిర్మాణ తీర్మానం రద్దు చేయాలని డిమాండ్ చేశారు. ఫారం నిర్మాణం ఆపకపోతే ఆందోళన ఉధృతం చేస్తామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో గ్రామ పోరాట కమిటీ మరియుప్రజలు పెద్ద ఎత్తున పాల్గొన్నారు. పోలీసులు బందోబస్తు ఏర్పాటు చేశారు.

## రైతులకు నష్టపరిహారమివ్వాలి :ఎంఎల్ఎ గద్దె

**ప్రజాశక్తి - కంచికచర్ల :** ఇటీవల కురిసిన మిచౌంగ్ తుఫాన్‌కు పంటలు నీట మునిగి నష్టపోయిన రైతులకు ప్రభుత్వం తక్షణమే పంట నష్టపరిహారం అందించి ఆదుకోవాలని టిడిపి విజయవాడ తూర్పు ఎమ్మెల్యే గద్దె రామ్మోహన్ డిమాండ్ చేశారు. కంచికచర్ల మండలం గని ఆత్కూరు, చెవిటికల్లు గ్రామాల పరిధిలో ఇటీవల కురిసిన తుఫాన్‌కు నీట మునిగిన వరి, పత్తి, మిర్చి పంటలను నందిగామ మాజీ ఎమ్మెల్యే తంగిరాల సౌమ్య, జనసేన నాయకురాలు తంబళ్ళపల్లి రమాదేవితో సోమవారం పరిశీలించారు. బాధిత రైతులను నష్టం వివరాలు అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వారం రోజులుగా ఇంకా వరి, మిర్చి, పత్తి పంటలు నీటిలోనే మునిగి ఉన్నా, పంట నష్టం వివరాలు సేకరించేందుకు ప్రభుత్వం అధికారులను క్షేత్రస్థాయిలో పరిశీలనకు పంపకపోవటం దారుణమన్నారు. పంటలు నీట మునిగి రైతులు లక్షలాది రూపాయలు నష్టపోతే ఈ ప్రభుత్వానికి చలనం లేదని విమర్శించారు. కంచికచర్ల మండలంలో 2160 ఎకరాల్లో వరి, 7,500 ఎకరాల్లో పత్తిపంట నీటి పాలై రైతులు దిక్కుతోచని స్థితిలో ఉన్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో తెలుగు రైతు జిల్లా అధ్యక్షుడు చెరుకూరి రాజేశ్వరరావు, పార్టీ నాయకులు కనుపర్తి శ్రీనివాస్, మండల టిడిపి అధ్యక్షుడు కోగంటి బాబు, రైతు నాయకుడు మాగంటి బాబు, కొంద్రగుంట శ్రీనివాసరావు, వెంపరాల వెంకటేశ్వరరావు, మూరకొండ ఏడు కొండలు తదితరులు పాల్గొన్నారు.

## ఉర్దూ రాని టీచర్‌తో బోధన

**ప్రజాశక్తి - వన్‌టౌన్ :** ఉర్దూ మీడియం హైస్కూల్‌లో ఉర్దూ తెలియని, ఉర్దూ రాని టీచర్‌చే విద్యా బోధన చేయించటాన్ని రూట నాయకులు అభ్యంతరం వ్యక్తం చేశారు. వించిపేట, గాంధీ బొమ్మ సెంటర్‌లో గల ఎస్.ఎన్.ఎమ్.సి. ఉర్దూ మీడియం బాలికల హైస్కూల్‌లో లెక్కలు బోధించటానికి కొత్తపేట అన్నపూర్ణాదేవి మునిసిపల్ హైస్కూల్‌లో పనిచేస్తున్న జె.శ్రీనివాసరావును నియమించడం పట్ల రూట ఏ.పి.(రాష్ట్ర ఉర్దూ టీచర్స్ అసోసియేషన్, ఆంధ్ర ప్రదేశ్) అధ్యక్షులు ఎమ్.ఎస్.ఇమామ్ బాషా సోమవారం ఒక ప్రకటనలో అభ్యం తరం వ్యక్తం చేశారు. ఉర్దూ ఎలిమెంటరీ స్కూల్‌లో లెక్కలు టీచర్‌గా బోధిస్తున్న సయ్యద్ హఫీజ్, అందులోని హైస్కూల్‌లో లెక్కలు బోధించడానికి అంగీకారం తెలిపి నప్పటికీ, శ్రీనివాసరావును కేటాయించడం విద్యాశాఖ అనాలోచిత నిర్ణంగా ఉందన్నారు.

## విషప్రచారం మానుకోవాలి

మాట్లాడుతున్న సామినేని ఉదయభాను

**ప్రజాశక్తి - వత్సవాయి :** వరదలపై పచ్చ పత్రికలు విష ప్రచారాన్ని మాను కోవాలని ప్రభుత్వ విప్, జగ్గయ్యపేట ఎమ్మెల్యే సామినేని ఉదయభాను అన్నారు. సోమవారం మంగోల్లులో వై ఏపీ నీడ్స్ జగన్ కార్యక్రమంలో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. సంక్షేమ పథకాల డిస్ప్లే బోర్డు ఆవిష్కరణ అనంతరం ఉదయభాను మాట్లాడుతూ మిచాంగ్ తుఫాను వల్ల రైతులు తీవ్రంగా నష్టపోయారని, వారిని ఆదుకునేందుకు ముఖ్యమంత్రి జగన్ మోహన్ రెడ్డి కట్టుబడి ఉన్నారని తెలిపారు. ఈ కార్యక్రమానికి ప్రతి గ్రామంలో ప్రజల నుంచి మంచి స్పందన వస్తోందని చెప్పారు.

## రోడ్డు నిర్మాణ పనులు ప్రారంభం


శంకుస్థాపన చేస్తున్న దృశ్యం

**ప్రజాశక్తి - జగ్గయ్యపేట:** పట్టణంలోని 2వ వార్డులో ఇండోర్ స్టేడియం వెనుక రోడ్డు సరిగా లేదని గడప గడపకు మన ప్రభుత్వంలో ప్రజలు తెలిపారు. పర్యటనలో ఉదయభాను పాల్గొన్న సమయంలో కౌన్సిలర్ కొలగాని రాము, వార్డు ప్రజలు ఆయన దృష్టికి సమస్యను తీసుకొచ్చారు. దీంతో మున్సిపల్ ప్రత్యేక నిధులతో ఏర్పాటు చేయబోతున్న రోడ్డు నిర్మాణ పనులకు సోమవారం మున్సిపల్ చైర్ పర్సన్ రంగాపురం రాఘవేంద్ర శంకుస్థాపన చేశారు. పట్టణంలో అభివృద్ధి పనులు విజయవంతంగా నడుస్తున్నాయని, రూ.9.6 లక్షల వ్యయంతో రోడ్డు నిర్మాణ పనులను ప్రారంభించినట్లు మున్సిపల్ చైర్‌పర్సన్ రంగాపురం రాఘవేంద్ర తెలిపారు. ఈ కార్యక్రమంలో వైస్ చైర్‌పర్సన్ తుమ్మల ప్రభాకరరావు, కౌన్సిలర్ కొలగాని రాము, వైసిపి నాయకులు, ప్రముఖ పాత్రికేయులు ముత్యాల సైదేశ్వరరావు, మున్సిపల్, సచివాలయం సిబ్బంది, వాలంటీర్లు తదితరులు పాల్గొన్నారు.

## సొసైటీ గోడౌన్ ప్రారంభం

సొసైటీ గోడౌన్‌ను ప్రారంభిస్తున్న కెడిసిసి బ్యాంకు చైర్మన్, పద్మావతి, ఎమ్మెల్యే జగన్మోహన్ రావు

**ప్రజాశక్తి - కంచికచర్ల :** రైతులు తీసుకున్న ఋణాలను సకాలంలో చెల్లించి సహకార సంఘాల బలోపేతానికి కషి చేయాలని కెడిసిసి బ్యాంకు చైర్మన్ తాతినేని పద్మావతి అన్నారు. కంచికచర్ల మండలం పరిటాల సహకార సంఘం ఆధ్వర్యంలో కెడిసిసి బ్యాంకు నిధులు 25 లక్షల రూపాయల వ్యయంతో నూతనంగా నిర్మించిన గోడౌన్ ను నందిగామ ఎమ్మెల్యే డాక్టర్ మొండితోక జగన్మోహన్ రావు తో కలిసి ప్రారంభించారు. ఈసందర్భంగా సొసైటీ అధ్యక్షుడు మాగంటి వినయ్ అధ్యక్షతన జరిగిన సభలో తాతినేని పద్మావతి మాట్లాడారు. రైతులకు తక్కువ వడ్డీకి పంట ఋణాలు ఇచ్చే సహకార రంగాన్ని నిలబెట్టుకోవాల్సిన బాధ్యత రైతులపై ఉందన్నారు. సకాలంలో ఋణాలు చెల్లించిన రైతులకు వడ్డీ రాయితీతో పాటు రైతు సంక్షేమం కోసం జిల్లా సహకార బ్యాంకు పనిచేస్తుందన్నారు. వైసిపి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక రైతులకు అన్ని రకాల రాయితీ ఇస్తూ రైతు సంక్షేమం కోసమే ప్రభుత్వం పనిచేస్తుందన్నారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ యద్దనపూడి ఆనంద జ్యోత్స్న, సొసైటీ మాజీ అధ్యక్షుడు చింతా రవీంద్ర, మాజీ ఎంపిపి పాటిబండ్ల హరి జగన్నాథరావు, కర్ల రామకష్ణ తదితరులు పాల్గొన్నారు.

## రాం ప్రదీప్‌కు బాలీవుడ్ దర్శకుడు అభినందనలు

**ప్రజాశక్తి - తిరువూరు :** పౌరులలో దేశభక్తి, సోదర భావం పెంచడానికి ప్రముఖ కవి పైడిమర్రి వెంకట సుబ్బారావు రచించిన భారత దేశం నా మాతభూమి ప్రతిజ్ఞ సందేశాన్ని విద్యార్థులలోకి విస్తతంగా తీసుకెళ్లేందుకు వివిధ రూపాల్లో పదేళ్లకు పైగా జనవిజ్ఞాన వేదిక ప్రతినిధి, ఉపాధ్యాయుడు ఎం.రాంప్రదీప్ అవిశ్రాంతంగా కషి చేస్తుండటం అభినందనీయమని ప్రముఖ హిందీ చిత్ర దర్శకుడు షాద్ అలీ పేర్కొన్నారు. ఆయన ఆహ్వానం మేరకు రాంప్రదీప్ సోమ వారం ముంబాయిలో షాద్ అలీని మర్యాద పూర్వకంగా కలుసుకున్నారు. రాంప్రదీప్ చేస్తున్న కృషి గురించి ఆరా తీశారు. ప్రతిజ్ఞ రచయితకు దేశ వ్యాప్తంగా గుర్తింపు తీసుకు రావడానికి తన వంతు కృషి చేస్తానని ఆయన తెలిపారు. షాద్ అలీ హిందీలో సాథియా, బంటీ ఔర్ బబ్లీ, సూర్మా వంటి పలు విజయ వతమైన చిత్రాలకు దర్శకత్వం వహించారు.

పౌష్టికాహారం పంపిణీ చేస్తున్న ట్రస్ట్ సభ్యులు

## హెచ్ఐవి బాధితులకు పౌష్టికాహారం

**ప్రజాశక్తి - జగ్గయ్యపేట:** కర్లపాటి ఛారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో శ్రీ శ్రీ స్వామి రామానంద సరస్వతి స్వామి ఆశీస్సులతో హెచ్ఐవి బాధిత పిల్లలకు డిసెంబర్ మాసానికి పౌష్టికాహారాన్ని అందజేసినట్లు ఆ సంస్థ వ్యవస్థాపకులు సామాజికవేత్త కర్లపాటి వెంకట శ్రీనివాసరావు తెలిపారు. తాను విదేశాల్లో ఉన్న కారణంగా ట్రస్ట్ సిబ్బంది చేత కార్యక్రమాన్ని నిర్వహిం చినట్లు ఆయన సమాచారాన్ని అందజేశారు. ఈ కార్యక్రమంలో శ్రేయస్సు సిబ్బంది కోటి, విజయ్ కుమారి, లక్ష్మి, ట్రస్ట్ సిబ్బంది రాజ్యలక్ష్మి, హైమావతి పాల్గొన్నారు.

కిట్లు అందజేస్తున్న దృశ్యం

## 'ఆడుదాం ఆంధ్ర' కిట్లు పంపిణీ

**ప్రజాశక్తి - పెనుగంచిప్రోలు :** స్థానిక మండల ప్రజా పరిషత్ కార్యాలయంలో ఆడుదాం అంధ్ర ఆటల పోటీల బ్రోచర్‌ను మండల ప్రజా పరిషత్ అధ్యక్షులు మార్కపూడి గాంధీ సోమవారం ఆవిష్కరించారు. పోటీలకు సంబంధించిన కిట్లను సచివాలయ సిబ్బందికి అందజేశారు. ఈ కార్యక్రమంలో మండల అధికారులు మెడికల్ ఆఫీసర్ ఇందిరా దేవి, మండల ఎఇ సుందర రామయ్య, ఐసిడిఎస్ సూపర్ వైజర్ ఉషా రాణి, సిద్ధారెడ్డి, సిబ్బంది, సచివాలయం సిబ్బంది పాల్గొన్నారు.

ఎస్ఐని అభినందిస్తున్న దృశ్యం

## ఎస్ఐకు అభినందనలు

**ప్రజాశక్తి - జగ్గయ్యపేట:** బహుజన్ సమాజ్ పార్టీ జగ్గయ్యపేట నియోజకవర్గ ఇన్చార్జ్ కొదమల్ల ప్రభుదాస్ ఆధ్వర్యంలో జగ్గయ్యపేట పట్టణానికి నూతనంగా వచ్చిన ఎస్ఐ ఆనంద్ కుమార్‌ని బిఎస్‌పి నాయకులు కలిసి అభినందనలు తెలిపారు. వీరిలో నాయకులు కోదమల ప్రభుదాస్, నియోజకవర్గ అధ్యక్షులు అన్నిపాక కార్తీక్, కన్వీనర్ కేవీ రత్నం, తదితరులున్నారు.

# సఫాయి కార్మికులు ప్రయోజనాలను అందిపుచ్చుకోవాలి : కలెక్టర్

**ప్రజాశక్తి-కలెక్టరేట్ ( కృష్ణా):** సఫాయి కర్మచారీల జీవన ప్రమాణాలను పెంచేందుకు కేంద్ర ప్రభుత్వం అందిస్తున్న ఆర్థిక సహాయాన్ని అందిపుచ్చుకొని మెరుగైన సౌకర్యాలు సద్వినియోగం చేసుకోవాలని జిల్లా కలెక్టర్ పి.రాజాబాబు కోరారు. ఎస్సీ కార్పొరేషన్ ద్వారా ఎన్ఎస్‌కెఎఫ్‌డిసి పథకం కింద రూ.31,67,326 విలువ చేసే సెప్టిక్ ట్యాంకులు శుభ్రపరిచే వాహనాలను సోమవారం కలెక్టరేట్ ప్రాంగణంలో జిల్లా కలెక్టర్ లబ్ధిదారులకు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం జాతీయ సఫాయి కర్మచారి ఆర్థిక అభివృద్ధి సంస్థ ద్వారా సఫాయి కర్మచారీలకు 50 శాతం సబ్సిడీతో మూడు వేల లీటర్ల సామర్థ్యం గల సెప్టిక్ ట్యాంకులు శుభ్రపరిచే వాహనాలను అందజేస్తుందన్నారు. సఫాయి కర్మచారీలు గతంలో చేతులతో సెప్టిక్ ట్యాంకులు శుభ్రపరిచేవారని దాంతో వారు అనారోగ్యం పాలు అయ్యే అవకాశాలు గుర్తించి నేడు వారికి కేంద్ర ప్రభుత్వం ప్రత్యేక యంత్ర వాహనాలను సమకూరుస్తోందన్నారు. ఈ పథకాన్ని చాలా తక్కువ మంది వినియోగించుకుంటున్నారన్నారు. వీలైనంత ఎక్కువమంది ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకునేలా మున్సిపల్, ఎస్సీ కార్పొరేషన్ ద్వారా విస్తృతంగా అవగాహన కల్పిస్తామన్నారు. సఫాయి కర్మచారీలు పొందిన వాహనాలను మునిసిపల్ కార్పొరేషన్‌లో వినియోగించుకోవాలని తద్వారా వారికి నిరంతరం ఆదాయం లభిస్తుందన్నారు. అనంతరం 11 మంది లబ్ధిదారులకు జగనన్న దళిత సంపూర్ణ భూహక్కు పత్రాలను జిల్లా కలెక్టర్ పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో ఎస్సీ కార్పొరేషన్ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ కె.చంద్ర లీల, మున్సిపల్ కార్పొరేషన్ కమిషనర్ చంద్రయ్య, జిల్లా ఎస్సీ సంక్షేమ సాధికారత అధికారి షాహిద్ బాబు పాల్గొన్నారు.

వాహనాలను అందజేస్తున్న కలెక్టర్ రాజాబాబు

## రూ.35 లక్షలతో పూడికతీత పనులు

**ప్రజాశక్తి-ఉయ్యూరు**

డిఎంఎఫ్ నిధులు రూ.35 లక్షలతో కనకవల్లి డ్రెయిన్ పూడికతీత పనులు చేపట్టనున్నట్లు ఎమ్మెల్యే కేపీ సారథి తెలిపారు. పెదఓగిరాలలో సోమవారం పర్యటించి తుపాన్ ప్రభావంతో కురిసిన వర్షాలకు పొలాల్లో నీరు నిలిచి నేలకొరిగిన వరి, పనలపై ఉన్న పొలాలు, కనకవల్లి మైనర్ డ్రెయిన్‌ను పరిశీలించారు. ఈ సందర్భంగా డ్రెయిన్ పూడిక తీతకు ఎంత ఖర్చవుతుందని మురుగునీటి కాల్వల నిర్వహణ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ విజయలక్ష్మి, ఏఈ మణికంఠను ఎమ్మెల్యే వివరణ అడగగా పెదఓగిరాల నుండి కనకవల్లి వరకు రూ. 35 లక్షలు అవుతుందని అంచనా తెలిపారు. దీనిపై ఫోన్ ద్వారా జిల్లా కలెక్టర్ దష్టికి తీసుకువెళ్లి ఆ మొత్తాన్ని మంజూరు చేయాలని కోరడంతో కలెక్టర్ ఒప్పుకున్నారు.

## 108 అట్రాసిటీ కేసులు గుర్తింపు : కలెక్టర్

**ప్రజాశక్తి-కలెక్టరేట్ (కృష్ణా)**

జిల్లాలోని మహిళలపై 108 అట్రాసిటీ కేసులకు సంబంధించి రాష్ట్ర ప్రభుత్వం 45.42 లక్షల రూపాయలను మంజూరు చేసినట్లు జిల్లా కలెక్టర్ పి రాజాబాబు పేర్కొన్నారు. సోమవారం నగరంలోని కలెక్టరేట్ స్పందన సమావేశ మందిరంలో జిల్లా కలెక్టర్ యాసిడ్ దాడికి గురైన మచిలీపట్నానికి చెందిన మీర్ రజా హుస్సేన్ సతీమణి మీర్ ఆసియా బేగంకు 3 లక్షల రూపాయల ఆర్థిక సహాయం అందజేశారు. ఈ కార్యక్రమంలో సంయుక్త కలెక్టర్ డాక్టర్ అపరాజిత సింగ్, ఐసిడిఎస్ పీడీ సువర్ణ పాల్గొన్నారు.

## మొబైల్ అన్న క్యాంటీన్ ప్రారంభం

**ప్రజాశక్తి-ఉయ్యూరు**

పేదవారి ఆకలి తీర్చాలన్న లక్ష్యంతో టిడిపి ప్రారంభించిన అన్నక్యాంటీన్‌లను వైసిపి ప్రభుత్వం రద్దుచేసి పేదవారి నోటికాడ కూడు తీసిందని మాజీ ఎంపీ కొనకళ్ల నారాయణరావు, మాజీ ఎమ్మెల్యే బోడె ప్రసాద్ ఆగ్రహం వ్యక్తం చేశారు. తెలుగు యువత జిల్లా అధ్యక్షుడు దండమూడి చౌదరి ఆధ్వర్యంలో ఉయ్యూరులో పార్టీ కార్యాలయం వద్ద ఏర్పాటు చేసిన మొబైల్ అన్న క్యాంటీన్ సోమవారం వారు ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో వెలగపూడి శంకరబాబు, వర్ల కుమార్‌రాజా, కొనకళ్ల బుల్లయ్య, యెనిగళ్ల కుటుంబరావు, గుర్నాధరావు పాల్గొన్నారు.

## చల్లపల్లిలో దొంగల హల్‌చల్

- మూడు దుకాణాల్లో చోరీ
- మరో మూడు దుకాణాల్లో చోరీకి యత్నం

**ప్రజాశక్తి-చల్లపల్లి:** చల్లపల్లిలో ఆదివారం రాత్రి దొంగలు హల్‌చల్ చేశారు. సేకరించిన సమాచారం మేరకు మొత్తం ఆరు షాపుల్లో దొంగలు చోరీకి యత్నించినట్లు తెలుస్తోంది. స్థానిక బస్టాండ్ ఎదురుగా ఉన్న వైష్ణవి మెడికల్స్ లో లక్షన్నరకు పైగా, వైశ్య బజార్ లోని విజయ చాముండేశ్వరి ఎలక్ట్రికల్స్ లో రూ.9,500, మెయిన్ రోడ్ లోని శ్రీదేవి మెడికల్ షాపులో దాదాపు పది వేల వరకు నగదు దొంగిలించబడినట్లు ఆయా షాపుల యజమానులు చెబుతున్నారు. వైశ్య బజార్ లోని కొల్లిపర ఆంజనేయులు ఫెర్టిలైజర్స్, గ్రోమోర్ షాపుల షట్టర్లు తాళాలు పగలగొట్టి షట్టర్లు ఓపెన్ చేయకుండానే వెళ్లిపోయినట్లు సమాచారం. బస్టాండ్ ఎదురుగా ఉన్న అమ్మ మొబైల్స్ పక్కనున్న ఆర్ఆర్ మొబైల్స్ షాపుల్లోని సీసీటీవీ కెమెరాల వైర్లు కట్ చేశారు. అమ్మ మొబైల్స్ షాప్ తాళాలు పగలగొట్టినప్పటికీ షట్టర్ ఓపెన్ చేయలేదని ఆ షాప్ నిర్వాహకులు చెబుతున్నారు. దొంగలు ద్విచక్ర వాహనంపై వచ్చినట్లు తెలుస్తోంది. రెండు మూడు రౌండ్లు బస్టాండ్ ఎదుట ప్రధాన రహదారిపై తిరిగినట్లు సీసీటీవీ కెమెరాల్లో రికార్డయింది. బైకుపై వచ్చిన ఇద్దరిలో ఒకరు బైకు దిగి సీసీటీవీ కెమెరా వైర్లు కట్ చేసేంతవరకు రికార్డయింది. చోరీ జరిగిందని సమాచారం అందుకున్న చల్లపల్లి ఎస్సై సిహెచ్ చిన్నబాబు వెంటనే అర్ధరాత్రి సమయంలోనే వచ్చి సంఘటనా స్థలాన్ని పరిశీలించారు.

## అసైన్డ్ లబ్ధిదారుల జాబితా ప్రదర్శించాలి

**ప్రజాశక్తి-కలెక్టరేట్ (కృష్ణా):** గత ప్రభుత్వాలు దఫదఫాలుగా పేదలకు పంపిణీ చేసిన అసైన్డ్ భూములను ప్రస్తుత ప్రభుత్వం లబ్ధిదారులకు

శాశ్వతంగా అమ్ముకునే, కొనుక్కునే హక్కు కల్పించే ఉద్దేశంతో 9/77 చట్ట సవరణ చేసిందని, ఆ భూములు అన్యాక్రాంతమై అనేకమంది పెత్తందారుల చేతుల్లో ఉన్నాయని, ఈ నేపథ్యంలో ప్రభుత్వ ఆదేశాల మేరకు వాస్తవ అసైన్డ్ లబ్ధిదారుల పేర్లను గ్రామ, వార్డు సచివాలయాల బహిరంగ నోటీసు బోర్డులో ప్రదర్శించాలని ఆంధ్రప్రదేశ్ వ్యవసాయ కార్మిక సంఘం కృష్ణా జిల్లా కమిటీ ప్రధాన కార్యదర్శి పి పవన్‌కుమార్ ఆధ్వర్యంలో కలెక్టర్‌కు వినతి పత్రం అందజేశారు. వినతి పత్రం ఇచ్చిన వారిలో కౌలు రైతు సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి పంచకర్ల రంగారావు, శీలం ప్రకాశరావు ఉన్నారు. అలాగే తుపాను వల్ల నష్టపోయిన రైతులను ఆదుకోవాలని ఆంధ్రప్రదేశ్ రైతు సంఘం కృష్ణాజిల్లా కమిటీ తరుపున జి.నాగేశ్వరరావు వినతి పత్రం అందజేశారు.

## విజ్ఞప్తుల స్వీకరణ

**ప్రజాశక్తి-కలెక్టరేట్ (కృష్ణా):** పోలీసు శాఖలో పనిచేస్తున్న సిబ్బంది ప్రశాంతంగా విధులు నిర్వర్తించాలంటే, వారికున్న సమస్యలన్నిటిని నివత్తి చేసుకున్నప్పుడే అది సాధ్యమని జిల్లా ఎస్పీ పి జాషువా అన్నారు. సోమవారం ఎస్పీ జిల్లా పోలీస్ కార్యాలయంలో పోలీస్ సిబ్బంది ఎదుర్కొంటున్న సమస్యలపై విజ్ఞప్తులు స్వీకరించారు. అనంతరం ఎస్పీ మాట్లాడుతూ ఏ సమస్య ఉన్న ధైర్యంగా తన దృష్టికి తీసుకురావచ్చని, ఆ సమస్యపై విచారణ జరిపి, సాధ్యాసాధ్యాలను పరిశీలించి, పూర్తి పారదర్శకంగా సమస్యను పరిష్కరిస్తామని హామీ ఇచ్చారు.

## పాలనలో ఆదర్శంగా నిలిచాం : జోగి

**ప్రజాశక్తి-బంటుమిల్లి:** రాష్ట్ర ముఖ్యమంత్రి వైయస్ జగన్మోహన్ రెడ్డి అట్టడుగు వర్గాల వారి సంక్షేమాభివృద్ధికి కృషి చేస్తూ పాలనలో ఆదర్శంగా నిలిచారని రాష్ట్ర గృహ నిర్మాణ శాఖ మంత్రి జోగి రమేష్ పేర్కొన్నారు. సోమవారం ఆయన బంటుమిల్లి మండలం ములపర్రు సచివాలయ పరిధిలోని ములపర్రు గ్రామంలో గడపగడపకు మన ప్రభుత్వం కార్యక్రమం నిర్వహించి రాష్ట్ర ప్రభుత్వం ప్రజలకు అందిస్తున్న సంక్షేమ పథకాల లబ్ధి వివరాలను ఇంటింటికి వెళ్లి వివరించి చెప్పారు. గ్రామస్తుల అభ్యర్థన మేరకు ఎస్సీ కాలనీలో పునాదుల స్థాయిలోనే నిలిచిపోయిన పాఠశాల పునర్నిర్మాణానికి నిధుల మంజూరుకు అధికారులను ఆదేశించారు. జల్ జీవన్ మిషన్ పథకం ద్వారా ఇంటింటికి కుళాయి కనెక్షన్లు, అంతర్గత రహదారులు, డ్రైనేజీల నిర్మాణం, విద్యుత్ స్తంభాల ఏర్పాటు వంటి సమస్యల పరిష్కారానికి కృషి చేస్తామని మంత్రి హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో జెడ్పీటీసీ మలిశెట్టి వెంకట రమణ, ఎంపిపి వెలివెల చినబాబు, వైస్ ఎంపీపీ ఒడిమి చిన్నారి బాబు, ఏఎంసీ ఛైర్మన్ పి.బాబూరావు, మత్స్యకార సంఘం డైరెక్టర్ తిరుమాని శ్రీనివాసరావు, మండల కన్వీనర్ సుజ్ఞాన మహేష్, ములపర్రు గ్రామ సర్పంచ్ బొడ్డు మంగమ్మ తదితరులు పాల్గొన్నారు.

# సత్తా చాటిన గుడ్లవల్లేరు ఇంజినీరింగ్ విద్యార్థులు

**ప్రజాశక్తి-గుడ్లవల్లేరు:** జవహర్ లాల్ టెక్నాలజికల్ యూనివర్సిటీ కాకినాడ వారు శ్రీ వాసవి ఇంజనీరింగ్ కళాశాల తాడేపల్లిగూడెంలో ఈ నెల 9 ,10వ తేదీల్లో నిర్వహించిన అంతర కళాశాలల టేబుల్ టెన్నిస్ టోర్నమెంట్‌లో మహిళల విభాగంలో ప్రథమ స్థానం, పురుషుల విభాగంలో ద్వితీయ స్థానం సాధించినట్లు గుడ్లవల్లేరు ఇంజనీరింగ్ కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ బి కరుణ కుమార్ తెలిపారు. అదేవిధంగా యూనివర్సిటీ వారు నవంబర్ మరియు డిసెంబర్ నెలలో నిర్వహించిన అంతర్ కళాశాలల క్రీడల భాగంలో మహిళల కబడ్డీ జట్టు, వాలీబాల్ జట్టు ఖోఖో పురుషుల జట్టు ప్రథమ స్థానం, పురుషుల నెట్ బాల్ జట్టు ద్వితీయ స్థానం సాధించారు. ఈ పోటీలలో పాల్గొన్న క్రీడాకారులు యూనివర్సిటీ టీముల కు ఎంపిక కాబడి జేఎన్టీయూ టీముల తరపున దక్షిణ భారత మరియు భారత అంతర్ విశ్వవిద్యాలయాల పోటీలలో పాల్గొంటారని తెలిపారు. ఈ

సందర్భంగా విద్యార్థులను, కళాశాల వ్యాయామ అధ్యాపకులు ఎం శివశంకర్, జి వెంకటేష్, టి.పూజితలను వైస్ ప్రిన్సిపల్ డాక్టర్ పి కోదండ రామారావు, డాక్టర్ శాస్త్రి, డైరెక్టర్ ఆర్అండ్‌డి డాక్టర్ ప్రసాద్, డైరెక్టర్ ఆశ డాక్టర్ ఎం కామరాజు, కళాశాల యాజమాన్య సలహాదారులు డాక్టర్ పి రవీంద్రబాబు అభినందించారు.

# రైతుల్ని మోసగిస్తున్న ప్రభుత్వం

## అఖిలపక్ష సమావేశంలో నేతలు

**ప్రజాశక్తి-కలెక్టరేట్ (కృష్ణా):** రాష్ట్ర ప్రభుత్వం రైతులను, పేద ప్రజలను నట్టేటా ముంచుతుందని పలువురు నాయకులు అన్నారు. సోమవారం జ్యోతిబా పూలే విజ్ఞాన కేంద్రంలో అఖిలపక్ష సమావేశం జరిగింది. ఈ సందర్భంగా సిపిఐ కృష్ణాజిల్లా కార్యదర్శి టి.తాతయ్య మాట్లాడుతూ తుపాన్ వల్ల నష్టపోయిన రైతులు, వ్యవసాయ కూలీలకు ఆర్థిక సహాయం అందిస్తామని చెబుతున్న

ప్రభుత్వం ఎంత ఇస్తుందో చెప్పకుండా మోసం చేస్తుందన్నారు. దీనిపై ఈ నెల 14వ తేదీన ధర్నా చౌక్‌లో జరిగే నిరాహార దీక్ష కార్యక్రమానికి సహకరించాలని కోరారు. బందరు నియోజకవర్గ కార్యదర్శి లింగం ఫిలిప్ మాట్లాడుతూ అన్ని పార్టీలు ముందుకు వచ్చి కౌలు రైతులకు రావాల్సిన హక్కుల కోసం పోరాడాలన్నారు. సిపిఎం పట్టణ కార్యదర్శి బూర సుబ్రహ్మణ్యం యజమాని సంతకంతో సంబంధం లేకుండా కౌలు రైతులకు నష్ట పరిహారం చెల్లించాలని డిమాండ్ చేశారు. మెట్ట ప్రాంత రైతులకు డబ్బై వేలు, మాగాణి ప్రాంత రైతులకు నలభై వేలు నష్ట పరిహారం చెల్లించాలని డిమాండ్ చేశారు. ఈ సమావేశంలో కాంగ్రెస్ పార్టీ పట్టణ అధ్యక్షుడు కొడమంచిలి చంద్రశేఖర రావు, కౌలు రైతుల సంఘం అధ్యక్షుడు కొండయ్య తదితరులు పాల్గొన్నారు.

## చైతన్య విద్యార్థి శశాంక్ ప్రతిభ

**ప్రజాశక్తి-చల్లపల్లి:** భగవద్గీత పారాయణ పోటీల్లో స్థానిక చైతన్య పాఠశాలలో మూడవ తరగతి విద్యార్థి మేకా శశాంక్ స్ఫూర్తి మొదటి బహుమతి సాధించారని పాఠశాల ప్రిన్సిపాల్ కె.రాజేష్‌బాబు తెలిపారు. మచిలీపట్నం కృష్ణవేణి ఐటిఐలో ఆదివారం నిర్వహించిన పోటీలలో ఎల్కేజీ నుంచి మూడవ తరగతి విభాగంలో ప్రథమ బహుమతి పొంది విజయవాడలో ఈ నెల 25న జరిగే రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపికైనట్లు తెలిపారు. సోమవారం స్థానిక చైతన్య పాఠశాలలో ఎజిఎం మద్దినేని మురళీకృష్ణ, రీజనల్ ఇంచార్జ్ జె.రాజేష్‌బాబు విద్యార్థిని అభినందించారు.

## మాస్టర్స్ అథ్లెటిక్స్‌లో మూడు స్వర్ణాలు

**ప్రజాశక్తి-గూడూరు:** గూడూరు మండలం జిల్లా పరిషత్ హైస్కూల్ ఫిజికల్ డైరెక్టర్‌గా పని చేస్తున్న మత్తి అరుణ మాస్టర్స్ అథ్లెటిక్స్ అసోసియేషన్ ఆఫ్ ఆంధ్రప్రదేశ్‌లో లాంగ్ జంప్ గోల్డ్ మెడల్, ట్రిపుల్ జంప్ గోల్డ్ మెడల్, 100 మీటర్స్ హడిలేస్ గోల్డ్ మెడల్ సాధించారు. ఈ నెల 8, 9,1 0 తేదీలలో తిరుపతిలో జరిగిన 42వ ఆంధ్రప్రదేశ్ స్టేట్ మాస్టర్స్ అథ్లెటిక్స్ చాంపియన్ షిప్‌లో కృష్ణా జిల్లా తరుపున పాల్గొన్న అరుణ ఈ ఘనతను సాధించారు. అలాగే జిల్లా పరిషత్ హైస్కూల్ గూడూరు నుండి 6వ తరగతి చదువుతున్న నిమ్మగడ్డ ప్రియదర్శిని అసోసియేషన్ ఫెన్సింగ్ గేమ్ ఫోయేల్ గ్రూప్ ఈవెంట్లో సిల్వర్ మెడల్, అలాగే ఇన్ విజువల్ ఫోయేల్ గేమ్లో బ్రాంచ్ మెడల్ సాధించింది. ఈ సందర్భంగా పీడీ అరుణ, ప్రియదర్శినిలను ప్రధానోపాధ్యాయురాలు డి.పుష్పలత తదితరులు అభినందించారు.

## బాబ్జీ జన్మదిన వేడుకలు

**ప్రజాశక్తి-గుడివాడ :** ది గుడివాడ కో-ఆపరేటివ్ అర్బన్ బ్యాంక్ చైర్మన్, టిడిపి నాయకులు పిన్నమనేని బాబ్జీ జన్మదిన వేడుకలు ఘనంగా జరిగాయి. సోమవారం స్థానిక భాస్కర్ థియేటర్ ఆవరణలో అర్బన్ బ్యాంక్ చైర్మన్ పిన్నమనేని పూర్ణవీరయ్య(బాబ్జీ) జన్మదిన వేడుకలను బాబ్జీ యువసేన నాయకుడు పైడిముక్కల వంశీ ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన కేక్‌ను బాబ్జీ కట్ చేశారు. అనంతరం అభిమానులు ఆయనను పూలమాలలతో ముంచెత్తారు. ఈ కార్యక్రమంలో నాయకులు సుంకర రమణ, గడ్డం ప్రకాష్‌రావ్, కెడిసిసి సిబ్బంది పాల్గొన్నారు.

## కారు ఢీకొని ఇద్దరికి గాయాలు

**ప్రజాశక్తి-గన్నవరం:** కారు ఢీకొని ఇద్దరు గాయపడిన ఘటన గూడవల్లి వద్ద సోమవారం చోటుచేసుకుంది. విజయవాడ వన్‌టౌన్ వస్త్రలత కాంప్లెక్స్‌లో దుస్తుల దుకాణంలో పనిచేసే నాగరాజు, షేక్ షహనాజ్ ఇద్దరు కలిసి స్కూటీపై విజయవాడ నుంచి ద్వారకాతిరుమల వెళ్లి తిరిగి వస్తుండగా గన్నవరం సమీపంలోని గూడవల్లి హెచ్‌పి పెట్రోల్ బంకు వద్దకు రాగానే వెనక నుంచి కారు ఢీ కొట్టింది. ఈ ప్రమాదంలో ఇద్దరు తీవ్రంగా గాయపడ్డారు. షహనాజ్ తలకు తీవ్రంగా దెబ్బలు తగలటంతో అపస్మారకస్థితిలోకి వెళ్లింది. స్థానికులు 108 ద్వారా క్షతగాత్రులను విజయవాడ ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు.

## దుర్గమ్మను దర్శించుకున్న ప్రముఖులు

**ప్రజాశక్తి - వన్‌టౌన్ :** శ్రీ దుర్గామల్లేశ్వర స్వామి వార్ల దేవస్థానం ఇంద్రకీలాద్రి శ్రీ కనకదుర్గ అమ్మవారిని సోమ వారం పలువురు ప్రముఖులు దర్శించు కున్నారు. ఆలయా నికి విచ్చేసిన పార్లమెంటు సభ్యులు, లోక్‌సభ ప్యానెల్ స్పీకర్ పెద్దిరెడ్డి మిథున్ రెడ్డి, తెలంగాణ రాష్ట్ర రెవెన్యూ, గృహ, సమాచార శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస రెడ్డికి ఆలయ మర్యాదలతో స్వాగతం పలికి ఆలయ ట్రస్ట్ బోర్డు చైర్మన్ కర్నాటి రాంబాబు అమ్మవారి దర్శనం కల్పించారు. వీరికి వేదపండితులు వేదాశీర్వచనం అనంతరం ఆలయ చైర్మన్ అమ్మవారి ప్రసాదం, శేషవస్త్రం, చిత్రపటం అందజేశారు. ప్రముఖ చిత్ర కథానాయకులు వెంకటేష్, 'సైంధవ్' చిత్ర బృందం సోమవారం ఆలయానికి విచ్చేశారు. వీరికి స్వాగతం పలికి, ఆలయ ట్రస్ట్ బోర్డు చైర్మన్ కర్నాటి రాంబాబు అమ్మవారి దర్శనం చేయించారు. అనంతరం వీరికి వేదపండితులు వేదాశీర్వచనం చేయగా, ఆలయ చైర్మన్ శ్రీ అమ్మవారి ప్రసాదం, శేషవస్త్రం, చిత్రపటం అందజేశారు.

## బస్సులో గంజాయి కలకలం

**ప్రజాశక్తి - జగ్గయ్యపేట:** జగ్గయ్యపేట డిపో బస్సులో గంజాయి కలకలం రేపింది. జగ్గయ్యపేట డిపోకి చెందిన బస్సు తిరుపతి వెళుతుండగా కావలి వద్ద బస్సులో బ్యాగులను చెక్ చేసిన పోలీసులకు అనుమానాస్పదంగా రెండు బ్యాగులు కనిపించాయి. విచారించినా ప్రయాణికులు సమాధానం చెప్పకపోవడంతో కావలి పోలీసుల సూచన మేరకు బస్సు డ్రైవరు డిపోలో అందజేశారు. బాగులకున్న తాళాలను పగలకొట్టి చూడగా ఒక బ్యాగులో బట్టలు, మరో బ్యాగులో మూడు ప్యాకెట్లలో సుమారు మూడు కేజీల 870 గ్రాములు గంజాయి ఉందని గుర్తించారు. డ్రైవర్లతో ఫిర్యాదు చేయించి జగ్గయ్యపేట ఎస్సై డి.ఆనంద్ కుమార్‌కు వాటిని అందజేశారు. ఎస్ఐ మాట్లాడుతూ గంజాయి ఎక్కడి నుంచి వచ్చింది అనే కోణంలో దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.

## 34వ డివిజన్‌లో 'భవిష్యత్‌కు గ్యారెంటీ'

**ప్రజాశక్తి - వన్‌టౌన్ :** జగన్ నమ్మకం కాదు అమ్మకం అని జనసేన నగర అధ్యక్షులు పోతిన మహేష్ ధ్వజమెత్తారు. సోమవారం ఇంటింటికి రాబోయే మన జనసేన టిడిపి ప్రభుత్వ కార్యక్రమంలో భాగంగా 34వ డివిజన్‌లో అధ్యక్షులు ఆకుల రవిశంకర్, డివిజన్ కమిటీ సభ్యులు ఆధ్వర్యంలో బాబు ష్యూరిటీ భవిష్యత్ గ్యారెంటీ ప్రచార కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా మహేష్ మాట్లాడుతూ జగన్ పాలనలో ప్రజలు అష్టకష్టాలు పడుతున్నారన్నారు. జనసేన టిడిపి ఉమ్మడి మేనిఫెస్టో గురించి చెబుతుంటే ప్రజలు పెద్ద ఎత్తున హర్షధ్వానాలు వ్యక్తం చేస్తున్నారన్నారు. విశాఖపట్నంలో టైకూన్ జంక్షన్ మూసివేతకు శాంతియుతంగా నిరసన తెలియజేస్తున్న జనసేన పిఎసి చైర్మన్ నాదెండ్ల మనోహర్, జనసేన నాయకుల అక్రమ అరెస్టులను తీవ్రంగా ఖండిస్తున్నామన్నారు. ఈ కార్యక్రమంలో వాయిస్ ఆఫ్ మాల మహానాడు అధ్యక్షులు శ్యామ్, పాస్టర్ అబ్సలోమ్ పాల్గొన్నారు.

## సంక్షేమ సారథి జగన్

**ప్రజాశక్తి - జగ్గయ్యపేట :** ముఖ్యమంత్రి వైఎస్ జగన్మోహన్ రెడ్డి ఎన్నో సంస్కరణలు చేపట్టి పాలనలో తనదైన ముద్ర వేశారని మున్సిపల్ చైర్మన్ రంగాపురం రాఘవేంద్ర అన్నారు. పట్టణంలోని 13వ సచివాలయంలో వై ఏపీ నీడ్స్ జగన్ కార్యక్రమాన్ని మున్సిపల్ చైర్మన్ రంగాపురం రాఘవేంద్రరావు నిర్వహించారు. ఈ సందర్భంగా రాఘవేంద్రరావు మాట్లాడుతూ ఇప్పటి వరకు ఈ సచివాలయ పరిధిలో 19 కోట్ల మేర అభివద్ధి సంక్షేమ కార్యక్రమాలు చేపట్టినట్లు తెలిపారు. సిఎం జగన్మోహన్ రెడ్డిని సామినేని ఉదయభానుని మరొకసారి గెలిపించుకోవాలని కోరారు. కార్యక్రమంలో మున్సిపల్ వైస్ చైర్మన్ తుమ్మల ప్రభాకర్, జిల్లా చేనేత విభాగం అధ్యక్షులు పెంటి శ్రీనివాస్, ఎస్టి విభాగం అధ్యక్షులు పాల్గొన్నారు.

## ముగ్గురు వ్యక్తుల నగర బహిష్కరణ పొడిగింపు

**ప్రజాశక్తి - విజయవాడ :** నగరంలో శాంతి భద్రతలకు, సామాన్య ప్రజా జీవనానికి విఘాతం కలిగిస్తూ, అవాంఛనీయ సంఘటనలకు కారణమవుతున్న నున్న పోలీస్ స్టేషన్ పరిధిలోని కసిరెడ్డి వెంకట నరసింహా రెడ్డి, పడ్డా దుర్గారావు, గోవింద రాజులను ఆరు నెలల పాటు నగరం నుండి బహిష్కరించినట్లు నగర పోలీసు కమిషనర్ కాంతిరాణాటాటా తెలిపారు. ఈ మేరకు ఆయన సోమవారం ఒక ప్రకటన విడుదల చేస్తూ వారి బహిష్కరణను మరో ఆరు నెలలు పొడిగించామన్నారు. వివిధ నేరాలకు సంబంధించి అరెస్ట్ అయ్యి జైలుకు వెళ్ళి బయటకు వచ్చిన అనంతరం కూడా తమ నేర ప్రవత్తిని మార్చుకోకపోవడం వలన, శాంతి భద్రతలకు విఘాతం కలుగ జేస్తున్నందున వారిని ఎన్.టి.ఆర్.జిల్లా పోలీస్ కమీషనరేట్ పరిధి నుండి బహిష్కరించామన్నారు.

## లంక భూములకు పట్టాలివ్వాలని వినతి

సబ్ కలెక్టర్‌కు వినతి పత్రం అందజేస్తున్న సిపియం బృందం

**ప్రజాశక్తి - ఇబ్రహీంపట్నం :** ఇబ్రహీంపట్నం మండల పరిధిలోని అనేక గ్రామాల్లో తరతరాలుగా సొసైటీలుగా ఏర్పడి భూములు సాగుచేసుకుంటున్న నిరుపేద కుటుంబంలో అర్హులైన పేదలకు లంక భూముల పట్టాలు ఇవ్వాలని సిపిఎం బృందం సోమవారం ఇబ్రహీంపట్నంలో సబ్ కలెక్టర్‌కు వినతిపత్రం అందజేసింది. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఇబ్రహీంపట్నం కొన్ని సొసైటీలో కొద్ది మందికి మాత్రమే లంక భూముల పట్టాలు ఇచ్చారని వీటిపై రెవెన్యూ అధికారులు జోక్యం చేసుకొని సరైన అర్హత కలిగిన పేదలకు లంక భూముల పట్టాలు ఇవ్వాలని డిమాండ్ చేశారు. లంక భూముల పట్టాలు లిస్టు బహిరంగంగా ప్రకటించాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో సిపిఎం టౌన్ కమిటీ కార్యదర్శి ఎం.మహేష్, కమిటీ సభ్యులు ఎ.విఠల్ రావు, బి.రామసీతా, బి.కష్ణరాయలు తదితరులు పాల్గొన్నారు.

## నదిలో లైసెన్స్, ఫిట్నెస్ లేని పడవలు

నందిగామలో లైసెన్స్ ఫిట్నెస్ ఇన్సూరెన్స్ లేని పడవలు ఇవే

**ప్రజాశక్తి - నందిగామ :** నందిగామ నియోజకవర్గంలో చందర్లపాడు మండలం పరిధిలో లైసెన్స్ ఫిట్నెస్ ఇన్సూరెన్స్ లేని పడవలు విచ్చలవిడిగా నడుపుతూ ప్రజల ప్రాణాలతో చెలగాట మాడుతున్నారు. ఎలాంటి అనుమతులు లేకుండా లాభమే ధ్యేయంగా పడవల యాజమాన్యం వ్యవహరిస్తున్నా అధికారులు పట్టించుకోవడం లేదు. ప్రాణాలు గుప్పిట్లో పెట్టుకొని బిక్కుబిక్కు అంటూ ప్రజలు ప్రయాణిస్తున్నారు. ప్రభుత్వం నిర్ణయించిన ధర కంటే అధిక ధర వసూలు చేస్తూ ప్రయాణికులను పీడిస్తున్నారు. ప్రభుత్వం నిర్ణయించిన ధర ప్రకారం ఒక ధరల పట్టిక బోర్డు ఏర్పాటు చేయాలని ప్రజలు కోరుతున్నారు. నిబంధలకు విరుద్ధంగా ప్రయాణీకుల వద్ద నుండి వందల రూపాయలు గుంజుతున్నారు. ఇష్టానుసారంగా అక్రమంగా వసూళ్లు చేస్తున్న అధికారులు పట్టించుకోకపోవడం పలు విమర్శకు తావిస్తుంది. ప్రయాణించే ప్రజలకు జరగరాని ప్రాణాపాయం జరిగితే బాధ్యత ఎవరు వహిస్తారు. ప్రమాదం జరగకముందే అక్రమ పడవలపై నియంత్రణ చేపట్టాలని ప్రజలు కోరుతున్నారు.

## ఉద్యోగ భద్రత కల్పించాలని వినతి

ఎంఎల్‌సి అరుణ్ కుమార్‌ను కలిసిన టీచర్స్

**ప్రజాశక్తి - నందిగామ :** నందిగామ పట్టణం వైసిపి కార్యాలయంలో శాసనమండలి సభ్యులు మొండితోక అరుణ్ కుమార్‌ను డాక్టర్ బి.ఆర్.అంబేద్కర్ గురుకుల పాఠశాల పార్ట్ టైం టీచర్స్ సోమవారం మర్యాదపూర్వకంగా కలిసి పలు సమస్యలపై వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా టీచర్స్ మాట్లాడుతూ ఆంధ్రప్రదేశ్ సాంఘిక సంక్షేమ గురుకులంలో రాష్ట్ర వ్యాప్తంగా 1900 మంది పార్ట్ టైం టీచర్స్ రెగ్యులర్‌తో పాటు అన్ని విధులు నిర్వర్తిస్తూ, ప్రతి సంవత్సరం మెరుగైన ఫలితాలు సాధిస్తున్నామని తెలిపారు. 1998 డీఎస్సీ టీచర్లను అన్ని ప్రభుత్వాలు వదిలేసిన జగనన్న ప్రభుత్వం వచ్చి వారికి మేలు చేసిందని తెలిపారు. 1900 కుటుంబాల్లో కూడా ఉద్యోగ భద్రత ఇప్పించి కాంట్రాక్టు టీచర్స్‌గా మార్చి తమ కుటుంబాల్లో వెలుగులు నింపాలని కోరారు. అనంతరం ఎమ్మెల్సీ మొండితోక అరుణ్ కుమార్ మాట్లాడుతూ నిరుద్యోగులకు ఉద్యోగ కల్పన, కాంట్రాక్టు ఉద్యోగులను రెగ్యులర్ చేసేందుకు ప్రభుత్వం దృష్టికి తీసుకువెళ్లి మేలు జరిగేలా కషి చేస్తానని హామీ ఇచ్చారు.

## వైసిపి ప్రభుత్వానికి చిత్తశుద్ధి లేదు

మాట్లాడుతున్న నెట్టెం రఘురాం

**ప్రజాశక్తి - గంపలగూడెం:** రాష్ట్రంలో చిత్తశుద్ధి లేని ప్రభుత్వం పరిపాలిస్తుందని ఎన్టీఆర్ జిల్లా టిడిపి కార్యదర్శి నెట్టెం రఘురాం పేర్కొన్నారు. పార్టీ అధినేత చంద్రబాబు నాయుడు ఆదేశాల మేరకు రఘురాం బృందం మంగళవారం పర్యటించింది. మండలంలోని పెనుగొలను గ్రామంలో మిరప, వరి పంటలను పరిశీలించారు. ఈ సందర్భంగా రఘురాం విలేకరులతో మాట్లాడుతూ, రైతులు సాగుచేసిన పంటలు నేలకొరిగినట్లు మరో 4 మాసాల్లో వైసీపి ప్రభుత్వం కూలబోతుందని జోష్యం చెప్పారు. మండలంలోని 17 వేల ఎకరాలు వరిసాగు, 10,500 ఎకరాలు మిర్చి సాగు చేసి రైతులు కుదేలైనట్లు వివరించారు. ఇంత జరుగుతున్నా ప్రభుత్వానికి,ఈ ముఖ్యమంత్రి కి చీమకుట్టినట్లు లేదని విమర్శించారు. రైతు భరోసా కేంద్రాలు ఎక్కడ పనిచేయడం లేదని ఆరోపించారు. ప్రతి ఎకరాకు పరిహారం ఇవ్వాలని రఘురాం డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో జిల్లా మైనార్టీ సెల్ నాయకులు సైదులు, నియోజకవర్గ పరిశీలకులు చిట్టా బత్తుల చిట్టిబాబు, ఇన్చార్జి చావాల దేదత్ పాల్గొన్నారు.

## లోకేష్ పాదయాత్రపై హర్షం

మాట్లాడుతున్న బుద్దా, నాగుల్ మీరా

**ప్రజాశక్తి - వన్‌టౌన్ :** యువగళంలో లోకేశ్ వేస్తున్న ప్రతి అడుగు ఉక్కుపిడుగులా జగన్ రెడ్డిపై, అతని ప్రభుత్వంపై పడుతోందని, జగన్‌లో వణుకు మొదలయ్యిందని టిడిపి నాయకులు బుద్దా వెంకన్న, నాగుల్‌మీరా అన్నారు. సోమవారం లోకేశ్ యువగళం యాత్ర మూడు వేల కిలోమీటర్లు పూర్తైన సందర్భాన్ని పురస్కరించుకొని తన కార్యాలయంలో టిడిపి రాష్ట్ర ప్రధాన కార్యదర్శి బుద్దావెంకన్న పార్టీ నేతలు కార్యకర్తలతో కలిసి కేక్ కట్ చేశారు. ముఖ్యఅతిథిగా టీడీపీ అధికార ప్రతినిధి నాగుల్ మీరా హాజరయ్యారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ యువగళం పాదయాత్ర ముగింపు సందర్భంగా విజయనగరం జిల్లా నెల్లిమర్లలో జరిగే భారీ బహిరంగ సభకు టీడీపీ నేతలు, కార్యకర్తలు భారీ సంఖ్యలో తరలిరావాలని వారు పిలుపునిచ్చారు. వచ్చే ఎన్నికల్లో రాష్ట్రప్రజలు టీడీపీని గెలిపించి చంద్రబాబుని ముఖ్యమంత్రిని చేయడం ఖాయమన్నారు. పశ్చిమ నియోజకవర్గం సీటు ఎవరికి ఇవ్వాలనేది చంద్రబాబు నిర్ణయిస్తారన్నారు. జనసేనతో పొత్తులో భాగంగా విజయవాడ పశ్చిమ స్థానం జనసేనకు కేటాయించినా తాము పార్టీ ఆదేశాల ప్రకారమే పనిచేస్తామని చెప్పారు. యువగళం పాదయాత్ర 3000 కి.మీ పూర్తి చేసుకున్న సందర్భంగా విజయవాడ ఎంపి కేశినేని శ్రీనివాస్ (నాని) ఆదేశాల మేరకు పశ్చిమ నియోజకవర్గం కార్యాలయంలో తెలుగుదేశం పశ్చిమ నాయకులు ఎం.ఎస్.బేగ్ ఆధ్వర్యంలో భారీ కేక్ కటింగ్ కార్యక్రమం జరిగింది. అనంతరం బేగ్ మాట్లాడుతూ యువగళం పాదయాత్ర 3వేల కి.మీ.ల చారిత్రాత్మక మైలురాయికి చేరుకొన్న సందర్భంగా హదయ పూర్వక శుభాకాంక్షలు తెలియచేస్తున్నామన్నారు.

పరీక్షలు చేయించుకుంటున్న గర్భిణులు

## గర్భిణులకు వైద్య పరీక్షలు

**ప్రజాశక్తి - అజిత్‌సింగ్‌నగర్ :** ప్రధానమంత్రి సురక్ష మాతత్వం అభియాన్ ప్రోగ్రాం. రాజీవ్ నగర్ యుపిహెచ్‌సిలో వైద్యాధికారి వంశీ లాల్ రాథోడ్ గర్భిణీలకు వైద్య పరీక్షలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రతి నెల 9న గర్భిణీలకు రక్త పరీక్షలు పరీక్ష చేసి హైరిస్కు ఉన్నవారికి తగు జాగ్రత్తల గురించి వివరించారు. వారు తీసుకోవలసిన పోషకాహారం గురించి తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎఎన్ఎంలు, స్టాఫ్ నర్స్, ఆశా వర్కర్లు పాల్గొన్నారు.

## జర్నలిస్టుల నిరసన

**ప్రజాశక్తి - కంచికచర్ల :** రాష్ట్రంలో జర్నలిస్టులపై జరుగుతున్న దాడులను నిలువరించి, జర్నలిస్టులకు రక్షణ కల్పించేందుకు ప్రభుత్వం ప్రత్యేక చట్టాలు తీసుకురావాలని పలువురు జర్నలిస్టులు డిమాండ్ చేశారు. రాష్ట్రంలో జర్నలిస్టులపై జరుగుతున్న దాడులను ఖండిస్తూ సోమవారం కంచికచర్లలో పలువురు యూట్యూబర్లు, పలు పత్రికల ప్రతినిధులు, సంఘాల నాయకులు నిరసన ప్రదర్శన నిర్వ హించారు. స్థానిక చెవిటికల్లు రోడ్డు సెంటర్‌లో గల అంబేద్కర్ విగ్రహానికి వినతి పత్రం అందజేశారు. రెండు రోజులు క్రితం కంచికచర్లలో యూట్యూబర్‌పై దాడి చేసిన వ్యక్తిపై కేసు నమోదు చేయాలని పోలీసులకు విజ్ఞప్తి చేశారు. తహాశీల్దార్ శంకరబాబుకు వినతిపత్రం అందజేశారు.

## గిఫ్ట్ స్కీంలో బహుమతులు

**ప్రజాశక్తి - ఇబ్రహీంపట్నం :** ఎపిఎస్ఆర్‌టిసి ఇబ్రహీంపట్నం డిపోలో అక్టోబర్ 17 నుంచి ఎంపిక చేసిన రూట్లలోని గిఫ్ట్ స్కీంలో విజేతలకు సోమవారం బహుమతులు అందజేశారు. స్వల్ప ఆదాయం కలిగి ఉన్న రూట్లలో ఆదాయాన్ని పెంపొందించు కోవటానికి పేపర్లలో ప్రకటన ద్వారా ప్రయాణికులకు తెలిపి ఈ గిఫ్ట్ స్కీమును అమలు చేసినట్లు డిపో మేనేజర్ ఎ.సుబ్రహ్మణ్యం తెలిపారు. ఇబ్రహీంపట్నం డిపోలోని నాలుగు రూట్లలో (144 ఎం, 307 కె, 145,309) నవంబర్ 11 నుంచి 30 వరకు ప్రయాణించిన ప్రయాణికులకు డ్రా ద్వారా గిఫ్ట్ స్కీం కింద 8 మంది ప్రయాణికులను విజేతగా ఎంపిక చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రయాణికులు టికెట్ వెనక పేరు ఫోన్ నెంబర్ రాసి బస్సులో ఏర్పాటు చేసిన గిఫ్ట్ స్కీం బాక్స్‌లో వేయాలని సూచించారు. ఈ అవకాశం సద్వినియోగం చేసుకోవాలని డిపో మేనేజర్ కోరారు.

## జనసేన సమావేశం

**ప్రజాశక్తి - నందిగామ :** జనసేన పార్టీ నందిగామ నియోజకవర్గం వీర్లపాడు మండలం, కొనతాలపల్లి గ్రామంలో జనసేన పార్టీ నాయకులు, జనసైనికులతో ఆత్మీయ సమావేశంలో నందిగామ జనసేన పార్టీ సమన్వయకర్త తంబళ్లపల్లి రమాదేవి పాల్గొన్నారు. ఈ సందర్భంగా రమాదేవి మాట్లాడుతూ రాబోవు ఎన్నికల్లో జనసేన టిడిపి కూటమికి కలిసి సమిష్టిగా అందరూ పనిచేయాలని సూచించారు. బూత్ కమిటీలు వేసి పోలింగ్ బూత్‌లు దగ్గర జనసైనికులు ఎలా వ్యవహరించాలి, ఎలాంటి సూచనలు పాటించాలో శిక్షణా తరగతులు నిర్వహించడానికి త్వరలో ఏర్పాట్లు చేస్తామని తెలిపారు. కార్యక్రమంలో మండల అధ్యక్షుడు బేతన్ పూడి జయరాజు, తదితరులు పాల్గొన్నారు.

# రైతులను ఆదుకోవాలని టిడిపి, జనసేన నిరసన

ప్రజాశక్తి-కలెక్టరేట్ (కృష్ణా) : తుఫాను వల్ల దెబ్బతిన్న రైతులను ఆదుకోవల్సిన , జగన్మోహన్ రెడ్డి ప్రచార ఆర్భాటంతో రైతులను మభ్యపెడుతున్నరని మాజీ మంత్రి టిడిపి పోలిట్ బ్యూరో సభ్యుడు కొల్లు రవీంద్ర విమర్శించారు. మిచౌంగ్ తుఫాను నష్టపోయిన పంటపొలాలను మాజీమంత్రి కొల్లు రవీంద్ర, మజీపార్లమెంట్ సభ్యులు కొనకళ్ల నారాయణ రావు ఆధ్వర్యంలో రైతు బందం రాష్ట్ర తెలుగు రైతు అధ్యక్షులు మర్రెడ్డి శ్రీనివాస్ రెడ్డి, మాజీ డిప్యూటీ స్పీకర్ బూరగడ్డ వేదవ్యాస్, నియోజవర్గ పరిశీలకులు లుక్కా సాయిరాం గౌడ్, జిల్లా రైతు అధ్యక్షులు గోపు సత్యనారాయణ తెలుగుదేశం నాయకులూ సోమవారం బందరు మండలం కొత్తపూడి, పొట్లపాలెం, పోతేపల్లి, ఎస్.ఎన్. గొల్లపల్లి, సీతారాంపురం గ్రామాల్లో నీటమునిగిన పంటను పరిశీలించారు. అనంతరం తెలుగుదేశ ప్రత్యేక బందం రైతులతో కలెక్టర్ కార్యాలయం చేరుకొని వరి పైరుతో కార్యాలయ ప్రధాన ద్వారం ముందు జనసేన పార్టీ ఇంచార్జ్ బండి రామకష్ణ, జనసేన కార్యకర్తలతో కలసి నిరసన తెలియజేసారు. అనంతరం కలెక్టర్ ను కలసి రైతుల సమస్యలు డిమాండ్‌లను వివరిస్తూ వినతి పత్రం అందజేశారు.ప్రజాశక్తి-తోట్లవల్లూరు : తుఫాన్ బాధిత రైతులకు తక్షణమే సాయం అందించాలని టిడిపి శ్రేణుల ఆధ్వర్యంలో సోమవారం తాసిల్దార్ కార్యాలయం ఎదుట నిరసన ధర్నా నిర్వహించారు. పామర్రు నియోజకవర్గ టిడిపి ఇన్చార్జి వర్ల కుమార్ రాజా ఆధ్వర్యంలో జరిగిన ఈ ధర్నా అనంతరం తహసిల్దార్ కుసుమ కుమారి కి వినతి పత్రం అందించారు.పార్టీ నాయకులు రాష్ట్ర కార్య నిర్వహణ కార్యదర్శి కొనకళ్ళ బుల్లయ్య, రాష్ట్ర కార్య నిర్వహణ కార్యదర్శి చిరుమామిళ్ల సూర్యనారాయణ ప్రసాద్, పామర్రు నియోజకవర్గ అబ్జర్వర్ కోట వీరబాబు, జనసేన మండల అధ్యక్షులు కృష్ణ సుమన్ తదితరులు పాల్గొన్నారు.

కలెక్టరేట్ వద్ద నిరసన చేస్తున్న నాయకులు

రైతులకు బోనస్ అందిస్తున్న చలసాని ఆంజనేయులు

## పాడి రైతులకు బోనస్ అందజేత

ప్రజాశక్తి హనుమాన్‌జంక్షన్: పాడి రైతు కుటుంబాల ఆర్థికాభివృ ద్దే కృష్ణామిల్క్ యూనియన్ లక్ష్యం అని ఛైర్మన్ చలసాని ఆంజనేయులు పేర్కొన్నారు. బాపులపాడు మండలం కాకులపాడు గ్రామంలోని పాలసొసైటీ రైతులకు సోమవారం ఆయన బోనస్ అందజేశారు. 2003-24 ను వత్సరానికి గాను రెండవ విడత బోనస్ నిమిత్తం 58మంది పాడిరైతులకు 110250 రూపాయల యూనియన్ బోనస్ అందజేశారు. గ్రామంలో అత్యధిక పాల ఉత్పత్తిదారునిగా రోజుకు 64లీటర్ల పాలు సొసైటీకి సరఫరా చేస్తు ఛైర్మన్ చలసాని మొదటిస్థానంలో నిలవగా, చెక్కా సోమేశ్వరరావు, గోళ్ల నాగమల్లేశ్వర రావు తరువాతిస్థానాల్లో నిలచారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ క్లిష్ట సమయాల్లో రైతుకు అండగా నిలబడుతూ ప్రధాన ఆదాయవనరైన పాడిపరిశ్రమను అభివద్ధి చేస్తూ పాడిరైతు కుటుంబాల సర్వతోముఖా భివద్ధికి కష్ణామిల్క్ యూనియన్ కషి చేస్తుందని అన్నారు. అనంతరం ఛైర్మన్ చలసాని ఆంజనే యులును సొలువాలతో పాడి రైతులు సత్కరించారు.ఈ కార్యక్ర మంలో మేనేజర్ కిలారు కిరణ్ కుమార్, సూపర్వైజర్ బావిశెట్టి వెంకటేశ్వరరావు, పాలకవర్గ సభ్యులు, పాడిరైతులు తదితరులు పాల్గొన్నారు.

## సచివాలయాలకు క్రీడా సామాగ్రి

ప్రజాశక్తి-గన్నవరం : ఆడుదాం ఆంధ్ర గన్నవరం మండల స్పోర్ట్ కిట్‌లను సచివాలయాలకు పంపిణి చేయనున్నట్లు ఎమ్. పి. డి.ఓ సత్య కుమార్ తెలిపారు. సోమవారం పిఈటీలతో కలిసి పరికరాలను విడ గొట్టారు. గన్నవరం మండలంలోని అన్ని గ్రామ పంచాయతీలకు క్రీడా సామాగ్రి పంపిణీ చేస్తామని చెప్పారు. క్రీడాకారులు పడుకునేందుకు వీలుగా పరికరాలు ఉంటాయన్నారు. పంచాయతీ కార్యదర్శి అనిల్ కుమార్, గన్నవరం నియోజక వర్గ క్రీడా సమన్వయ కర్త ధనియాల నాగరాజు, ఇ.ఓ పి.ఆర్.డి పి. వెంకటేశ్వరమ్మ, రాజేష్ పాల్గొన్నారు.

పెదపారుపూడిలో...

## సెమీ క్రిస్మస్ వేడుకలు

ప్రజాశక్తి-అవనిగడ్డ : అవనిగడ్డలోని మండలిపురం సర్వ కృపా ప్రార్థనా మందిరంలో పాస్టర్ ఫెలోషిప్ అధ్యక్షులు విలియం కేరి ఆధ్వర్యంలో సెమీ క్రిస్మస్ వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా డి.ఎస్.పి మురళీధర్ పాల్గొని వాక్యోపదేశం చేశారు. కార్యక్రమంలో పాస్టర్లు మోజెష్ పాలు మనోహర్ పాలు వాక్యం అందించారు ఈ సందర్భంగా 50 మంది పాస్టర్లకు నూతన వస్త్రాలను అందజేశారు. ఈ కార్యక్రమంలో పాస్టర్ల నాగాయలంక మండల ఫెలోషిప్ ప్రెసిడెంట్ కిరణ్ బాబు, జీవన ప్రసాద్ యోసోబు ప్రభాకర్ ఏసుబాబు తదితరులు పాల్గొన్నారు.ప్రజాశక్తి పెదపారుపూడి : పెదపారుపూడి మండలం వెంట్రప్రగడ గ్రామంలో జరిగిన గుడ్ న్యూస్ ఫెస్టివల్ ఆఖరి రోజు సభలో వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ జిల్లా మహిళా అధ్యక్షురాలు, మాజీ జెడ్పిటిసి కైలే జ్ఞానమణి పాల్గొని ప్రజలందరికి అడ్వాన్స్ క్రిస్మస్ శు భాకాంక్షలు కేకులు కట్ చేసి అడ్వాన్స్ క్రిస్మస్ శు భాకాంక్షలు తెలిపారు. ఈ కార్యక్రమంలో పాస్టర్ ఎం వేదనాయకంశాస్త్రి, వైఎస్ఆర్సిపి మండల అధ్యక్షుడు గోళ సోమేశ్వరరావు, మాజీ పామర్రు మార్కెట్ యార్డ్ డైరెక్టర్ చీకుర్తి వరప్రసాద్, పెద్దలు పాల్గొన్నారు.

# రైతులను పట్టించుకోవాలి : వెనిగండ్ల

ప్రజాశక్తి-గుడ్లవల్లేరు : రైతుల కష్టాన్ని పట్టించుకోని కొడాలి నాని ఎమ్మెల్యేగా అనర్హుడని గుడివాడ నియోజకవర్గ టిడిపి పార్టీ ఇంచార్జ్ వెనిగండ్ల రాము విమర్శించారు. మండలంలోని డోకిపర్రు, పోలిమెట్ల, పెంజెంద్ర గ్రామాలలో పంట నష్టం అంచనా కమిటీ సభ్యులతో కలిసి సోమవారం రాము పర్యటించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గుడివాడ నియోజవర్గంలో రైతులు కష్టాల్లో ఉంటే ఎమ్మెల్యే అధికారులు ఏమయ్యారని అన్నారు. ధాన్యం ఏ స్థితిలో ఉన్న షరతులు లేకుండా ధాన్యం కొనుగోలు చేయాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో తెలుగుదేశం పార్టీ మచిలీపట్నం పార్లమెంట్ స్థాయి కార్యదర్శి అట్లూరి శ్రీరామచంద్ర ప్రసాద్, మండల తెలుగు మహిళా అధ్యక్షురాలు తెల్లాకుల నాగలక్ష్మి, వీరమాచినేని శివప్రసాద్, వి మురళి, నాగరాజు, మహబూబ్ బేగ్, కోటేశ్వరరావు, మజీద్, శ్రీధర్ తెలుగుదేశం పార్టీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

పంటలు పరిశీలిస్తున్న వెనిగండ్ల రాము తదితరులు

# పోలీస్ సేవలను ప్రజలకు చేరువ చేయడమే లక్ష్యం

● గన్నవరం సిఐ పి.కనకారావు

ప్రజాశక్తి-గన్నవరం : లా అండ్ ఆర్డర్ పరంగా ప్రజలకు ఏ సమస్య వచ్చినా నేరుగా పోలీస్ స్టేషన్ కు వచ్చి అధికారులకు చెప్పుకునే అవకాశాన్ని కల్పించామని, ప్రజలు దానిని సద్వినియోగం చేసుకుంటున్నారని గన్నవరం పోలీస్ స్టేషన్ సర్కిల్ ఇన్స్పెక్టర్ పి. కనకరావు అన్నారు.

**ప్రశ్న. ఏ ఏ గ్రామాల్లో ఇబ్బందికర పరిస్థితులు ఉన్నాయి?**

కేసరపల్లి, ముస్తాబాద, అల్లాపురం, అజ్జం పూడి, దావాజీగూడెంలు సమస్యాత్మక గ్రామాల్లో ఉన్నాయి. వీటిలో కొంతమంది అసాంఘిక శక్తులుగా ఉన్నారు. కొంతమంది రౌడీ లు, కేడీలు గా ఉన్నారు. దొం గలు కూడా ఉన్నారు. వీరందరి పైన రోజువారి నిఘా పెట్టాం. స్టేషన్‌కు రప్పించి కౌన్సెలింగ్ కూడా ఇస్తున్నాం.

**ప్రశ్న.. గంజాయి నియంత్రణకు ఏం చర్యలు తీసుకుంటున్నారు?**

గన్నవరం పీఎస్ పరిధిలో గంజాయి విక్రయాలు లేకుండా చేయడానికి పటిష్ట చర్యలు చేపట్టాం. ఇప్పటికే కొంతమందిని అరెస్టు చేసి జైలుకు పంపడం జరిగింది. ముఖ్యంగా రాజీవ్ కాలనీ, అల్లాపురం, చెంచుల కాలనీ, వీఎన్ పురం గ్రామాల్లో గంజాయి విక్రయాలు సాగుతున్నట్లుగా సమాచారం ఉంది. దూర ప్రాంతాల నుంచి గంజాయి తీసుకువచ్చి యువకులకు విక్రయించి జేబులు నింపుకుంటున్న పరిస్థితి ఉంది. అలాంటి వారిని నిరాబంధాల ద్వారా గుర్తించి గంజాయి అమ్ముతుండగా పట్టుకుని అరెస్ట్ చేస్తున్నాం.

## నేడు డయల్ యువర్ డిఎం

ప్రజాశక్తి-అవనిగడ్డ : అవనిగడ్డ ఆర్టీసీ డిపోలో మంగళవారం డయల్ యువర్ డిఎం కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు డిపో మేనేజర్ కె హనుమంతరావు తెలిపారు. సోమవారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ ఉదయం 11 గంటల నుండి మధ్యాహ్నం 12 గంటల వరకు ఈ కార్యక్రమం నిర్వహించబడుతుందని తెలిపారు. డిపో పరిధిలోని ప్రజలు తమ ప్రయాణ అవసరాలపై సూచనలు సలహాలు ఫోన్ ద్వారా తెలియపరచాలని కోరారు. ప్రయాణికులు 99 5922 5466 నెంబర్లకు ఫోన్ చేసి తమ సలహాలు సూచనలు అందజేయాలని డిపో మేనేజర్ కోరారు.

## వృద్ధులకు అన్నదానం

ప్రజాశక్తి-గుడ్లవల్లేరు : స్థానిక లయన్స్ సేవా భవనం నందు లైన్స్ క్లబ్ ఆధ్వర్యంలో పూర్వ సభ్యులు వల్లభనేని వీరభద్ర రావు జ్ఞాపకార్థం వారి కుటుంబ సభ్యులచే నిరుపేద వృద్ధులకు 60 మందికి అన్నదానం, దుప్పట్ల పంపిణీ కార్యక్రమం సోమవారం నిర్వహించినట్లు అధ్యక్షుడు బొర్రా నాగేశ్వరరావు తెలిపారు. ఈ కార్యక్రమంలో జంగం మోహన్ రావు, పరంధామయ్య, చాపరాల బాలాజీ, పోలవరపు వెంకటరావు పాల్గొన్నారు.

## పంట నష్టం అంచనాలు రూపొందిస్తున్నాం : కలెక్టర్

ప్రజాశక్తి కలెక్టరేట్ (కృష్ణా) : మిచౌంగ్ తుఫాన్ వలన దెబ్బతిన్న వరి పంట నష్టం అంచనాలను తయారు చేసేందుకు అధికారులు సోమవారం సాయంత్రం నుండి ఎన్యుమరేషన్ చేపడతారని జిల్లా కలెక్టర్ పి. రాజాబాబు పేర్కొన్నారు. సోమవారం నగరంలోని కలెక్టరేట్ సమావేశ మందిరంలో జిల్లా కలెక్టర్, సంయుక్త కలెక్టర్ డాక్టర్ అపరాజిత సింగ్, ముడా విసి రాజ్యలక్ష్మి, మచిలీపట్నం ఆర్డిఓ ఎం వాణి లతో కలిసి జగనన్నకు చెబుదాం-స్పందన కార్యక్రమం నిర్వహించి వివిధ ప్రాంతాల ప్రజల నుండి విజ్ఞాపన పత్రాలు స్వీకరించారు. అనంతరం జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ జిల్లాలో తుఫాన్ వలన వరి పంట నీట మునిగిన విషయం తెలుసని ఈ సోమవారం సాయంత్రం నుండి వ్యవసాయ అధికారులు ఎన్యుమరేషన్ చేపట్టి పంట నష్టం అంచనాలను తయారు చేస్తారన్నారు. రైతులు ఎలాంటి ఆందోళన చెందవద్దని వారిని ప్రభుత్వం అన్ని విధాల ఆదుకుంటుందని చెప్పారు. అనంతరం కలెక్టర్ అధికారులతో మాట్లాడుతూ ప్రజలు వివిధ ప్రాంతాల నుండి ఎంతో శ్రమకోర్చి వ్యయప్రయాసలతో జిల్లా కేంద్రానికి వస్తున్నారని స్పందన అర్జీలను ప్రత్యేక శ్రద్ధతో సానుకూలంగా పరిష్కరించాలన్నారు. ఈ కార్యక్రమంలో జడ్పీ సీఈవో వి. జ్యోతి బసు, డీఈవో తాహెరా సుల్తానా, డిఎంహెచ్ఓ డాక్టర్ గీతాబాయి, పంచాయతీ రాజ్ ఎస్ఈ విజయ్ కుమారి తదితరులు పాల్గొన్నారు.

## కొత్త ప్రయోగంతో పంట నష్టం అంచనా

ప్రజాశక్తి-అవనిగడ్డ : రైతుల ధాన్యం దిగుబడులను పంట కోత ప్రయోగం ద్వారా వ్యవసాయ శాఖ అధికారులు అంచనా వేశారు. సోమవారం అవనిగడ్డలోని రెడ్ రౌతు సీతా మహాలక్ష్మి పొలంలో వ్యవసాయ అధికారులు ఏఎస్ఓ సిహెచ్ సురేష్ బాబు, నాలుగవ సచివాలయం వ్యవసాయ సహాయకురాలు ఏ జీవితలు ప్రయోగా త్మకంగా 24 గజాల అనగా అరసెంటు భూమిలో వరి పంటను కోసి నూర్పి తూకం వేయగా 16 కేజీలు 300 గ్రాములు ధాన్యము దిగుబడి వచ్చిందని తెలిపారు, ఈ లెక్కన ఎకరం పొలానికి 2400 వచ్చాయనిచ 100 సెంట్లు గాను 32 బస్తాలు దిగుబడి వస్తున్నట్లు అంచనా వేశారు. ఈ కార్యక్రమంలో రైతులు అన్నపురెడ్డి కష్ణ, గుగ్గిలం శ్యాం కుమార్, ఎర్రంశెట్టి సాయిరాం, కష్ణ చింతలపూడి రాఘవరావు తదితర రైతులు పాల్గొన్నారు.

# ముగిసిన అంతర్ కళాశాలల అథ్లెటిక్స్ పోటీలు

ప్రజాశక్తి-ఉయ్యూరు : అడుసుమిల్లి గోపాలకృష్ణయ్య మరియు చెరకు రైతుల సిద్ధార్థ కళాశాల లో మూడు రోజులపాటు జరిగిన కృష్ణా విశ్వవిద్యాలయ 12వ అంతర్ కళాశాల ల అథ్లెటిక్ పోటీలు సోమవారం ముగిసాయి. విశ్వవిద్యాలయ పరిధిలో వివిధ కళాశాలల విద్యార్థినీ విద్యార్థులు ఈపోటీల్లో పాల్గొని ప్రతిభ కనపరిచారు. చివ రి రోజున జరిగిన పోటీల్లో ఆఫ్ మార్థాన్ పురుషుల పోటీలో ఏజీఅండ్ఎస్ ఎస్ కళా శాలకు చెందిన కేఎస్ఆర్ కష్ణ ప్రథమ, ఎస్ఆర్ఆర్ అండ్ సీవీఆర్ కళాశాలకు చెందిన జి.వెంకటేష్ ద్వితీయ స్థానం సాధించారు. మహిళల పోటీలో ఏజీఅండ్ సజీఎస్ కళా శాల బి. శివలీల ప్రథమ, కేవీఆర్ కళాశాల టి. మౌనిక ద్వితీయ స్థానాలు గెలుచుకు న్నారు. 10 కిలోమీటర్ల పరుగు పురుషుల పోటీలో ఏఎస్ఆర్ కష్ణ, జీవన్ కుమార్ వరుసగా రెండు స్థానాల్లో వచ్చారు. మహిళల విభాగంలో బి.శివలీల ప్రథమ, స్వర్ణ మంజు ప్రథమ, ద్వితీయస్థానాలు గెలుపొందారు. 5కిలో మీటర్ల మహిళల పోటీలో సి హెచ్ భవాని, ఈ, రాజీ, కె. రేవతి ప్రథమ, ద్వితీయ, తతీయ స్థానాలు సాధించారు. 5 కిలోమీటర్ల పురుషుల పోటీలో జి. కిషోర్ బాబు, పి. సూర్యప్రకాశ్ వరుసగా రెండు స్థా నాల్లో వచ్చారు. పురుషుల ట్రిపుల్ జంప్లో వై మహేశ్, జీవన్ కుమార్ ప్రథ మ, ద్వితీయ స్థానాలు కైవసం చేసుకున్నారు. పురుషుల ఓవరాల్ చాంపియన్గా డాక్టర్ జాకీర్ హుస్సేన్ కళాశాల, మహిళల ఓవరాల్ చాంపియన్గా ఏజీ అండ్ ఎస్ క ళాశాల నిలిచాయి. ముగింపు కార్యక్రమంలో కళాశాల ప్రత్యేక అధికారి కె.సత్యనారా యణ, ప్రిన్సిపాల్ వి.శ్రీరామ్, జూనియర్ కళాశాల డైరెక్టర్ విజయ్యకుమార్, ప్రిన్సిపాల్ బుచ్చిరెడ్డి తదితరులు పాల్గొని వి జేతలకు బహుమతులు అందజేశారు.

ఓవరాల్ చాంపియన్ అందుకుంటున్న ఏజీఅండ్ఎస్ ఎస్ కళాశాల విద్యార్థినులు

విజయవాడ ప్రభుత్వాస్పత్రిలో శ్రీనివాసరావు మృతదేహం

## శ్రీనివాసరావు కుటుంబానికి రూ.50 లక్షలు నష్టపరిహారం ఇవ్వాలి

### సిఐటియు జిల్లా ప్రధాన కార్యదర్శి ఎన్.సిహెచ్.శ్రీనివాస్ డిమాండ్

**ప్రజాశక్తి - విజయవాడ :** విజయవాడ టౌన్ డివిజన్ పరిధిలోని బందర్‌లాకుల వద్ద విద్యుత్ కాంట్రాక్ట్ కార్మికుడుగా విధులు నిర్వర్తిస్తున్న బ్రేక్‌డౌన్ బ్యాచ్ కార్మికుడు దేవరకొండ శ్రీనివాసరావు విధి నిర్వహణలో ప్రమాదం జరిగి దుర్మరణం పాలయ్యాడని సిఐటియు ఎన్‌టిఆర్ జిల్లా ప్రధాన కార్యదర్శి, యునైటెడ్ ఎలక్ట్రిసిటీ కాంట్రాక్ట్ వర్కర్స్ యూనియన్ జిల్లా గౌరవాధ్యక్షులు ఎన్.సి.హెచ్ శ్రీనివాస్ తెలిపారు. విధి నిర్వహణలో ప్రాణాలు కోల్పోయిన దేవరకొండ శ్రీనివాసరావు కుటుంబానికి రూ.50 లక్షలు నష్టపరిహారం చెల్లించాలని ఆయన డిమాండ్ చేశారు. వర్క్‌మెన్ కాంపెన్సేషన్ చట్టం అమలు చేయాలని, విద్యుత్ యాజమాన్యం తక్షణమే స్పందించి ఆ కుటుంబానికి న్యాయం చేయాలని, కుటుంబ సభ్యులలో ఒకరికి ఉద్యోగం ఇవ్వాలని కోరారు. విద్యుత్ సంస్థలో తీవ్రమైన పని ఒత్తిడి, యాజమాన్య నిర్లక్ష్యమే ఈ ప్రమాదాలకు కారణమని పేర్కొన్నారు. కాంట్రాక్టు కార్మికులకు సంబంధం లేని పనులు కూడా వీరితో చేయించడం తగదని, అధికారులు తగిన రక్షణ సౌకర్యాలు చేపట్టకుండా పనులు పురమాయించడంతో తరచూ ప్రమాదాలు జరిగి కార్మికులు తీవ్రంగా గాయపడటంతోపాటు మరణిస్తున్న ఘటనలు ఉన్నాయని పేర్కొన్నారు. గతంలో ప్రమాదాల్లో గాయపడిన, మరణించిన కార్మికులకు న్యాయం చేయటంలో యాజమాన్యం నిర్లక్ష్యంగా వ్యవహరించిందని గుర్తుచేశారు. భవిష్యత్‌లో ఇటువంటి ప్రమాదాలు జరగకుండా అధికారులు తగిన రక్షణ చర్యలు చేపట్టాలని, ప్రమాదాలు నివారించటానికి చర్యలు తీసుకోవాలని కోరారు.

**మృతదేహాన్ని పరిశీలించిన నేతలు**

ఈ సంఘటన విషయం తెలుసుకున్న ఎన్.సిహెచ్.శ్రీనివాస్, సెంట్రల్ సిటీ అధ్యక్షులు ఎన్.దుర్గారావు, యునైటెడ్ ఎలక్ట్రిసిటీ కాంట్రాక్టు వర్కర్స్ యూనియన్ జిల్లా ప్రధాన కార్యదర్శి పి.అనిల్ కుమార్, నాయకులు ఎస్.విజయరావు, యునైటెడ్ ఎలక్ట్రిసిటీ ఎంప్లాయీస్ యూనియన్ జిల్లా నాయకులు తదితరులు హుటాహుటిన ప్రభుత్వ జనరల్ హాస్పటల్‌కు చేరుకుని శ్రీనివాసరావు మృతదేహాన్ని పరిశీలించారు. కుటుంబ సభ్యులను పరామర్శించారు. మరణించిన కార్మికుని కుటుంబానికి ప్రభుత్వం, అధికారులు న్యాయం చేయకపోతే ఆందోళన చేస్తామని హెచ్చరించారు.

## నీటిని పొదుపుగా వాడుకోండి : వీఎంసి కమిషనర్

**ప్రజాశక్తి - విజయవాడ :** మిచౌంగ్ తుపాను కారణంగా కురిసిన భారీ వర్షాలకు నగరంలోని హెడ్ వాటర్ వర్క్స్ నుండి డిశ్చార్జ్ సామర్థ్యం తగ్గిందని నగర పాలక సంస్థ కమిషనర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్ ఒక ప్రకటనలో తెలిపారు. అందువల్ల నగర ప్రజలు ఈ విషయాన్ని గమనించి నీటిని వధా చేయకుండా పొదుపుగా వాడుకోవాలని కోరారు.

## రంగుమారిన ధాన్యాన్నీ కొంటాం

(మొదటి పేజీ తరువాయి)

అనంతరం పేర్ని నాని మీడియాతో మాట్లాడుతూ ఇటీవల తెలంగాణాలో జరిగిన ఎన్నికల్లో ఓటు హక్కు వినియోగించుకున్న 11,154 మందికి జిల్లాలోనూ ఓట్లు ఉన్నాయని గుర్తించినట్లు తెలిపారు. ఎన్నికల సంఘం క్షణంగా పరిశీలించి తెలంగాణాలో ఓటు హక్కు వినియోగించుకున్న వారి ఓట్లను జిల్లాల్లోని ఏ నియోజకవర్గ జాబితాలో లేకుండా తొలగించాలన్నారు. మచిలీపట్నం నియోజకవర్గంలో డబ్బింగ్ ఓట్లు తొలగించాల్సి ఉందన్నారు. టిడిపి నాయకులు కొల్లు రవీంద్ర కుటుంబానికి మచిలీపట్నంలోని 116, 107 పోలింగ్ బూత్‌లలో రెండు చోట్ల ఓట్లు ఉన్నాయన్నారు. 2019 నుంచి కొనసాగుతున్న ఈ డబ్బింగ్ ఓట్లు ఉన్నాయని, ఈ ఓట్లపై టిడిపి నాయకులు అధికార పార్టీపై ఆరోపణలు చేయడం అర్థరహితమని అన్నారు.

# అర్జీలను త్వరగా పరిష్కరించండి

- స్పందనలో జెసి సంపత్‌కుమార్
- 117 అర్జీల స్వీకరణ

**ప్రజాశక్తి - విజయవాడ :** జగనన్నకు చెబుదాం-స్పందన కార్యక్రమంలో వచ్చిన ప్రతి అర్జీని క్షుణ్ణంగా పరిశీలించి సత్వరం పరిష్కరించాలని జాయింట్ కలెక్టర్ డా. పి.సంపత్ కుమార్ అధికారులను ఆదేశించారు. సోమవారం స్థానిక కలెక్టరేట్లో జెసి సంపత్ కుమార్...సబ్ కలెక్టర్ అదితి సింగ్‌తో కలిసి ప్రజల నుండి వినతులు స్వీకరించారు. రెవన్యూ విభాగానికి సంబంధించి 41, పోలీస్ శాఖకు సంబంధించి 24, మునిసిపల్‌కు 7, ఏపీసీపీడీసీఎల్‌కు 6, అటవీశాఖకు 5, ఉపాధికల్పనకు 4.. ఇలా వివిధ శాఖలకు సంబంధించి మొత్తం 117 అర్జీలు వచ్చాయి. ఈ సందర్భంగా జెసి మాట్లాడుతూ అర్జీలను నిర్దిష్ట గడువులోగా నాణ్యతతో పరిష్కరించాలని సూచించారు. అర్జీలను క్షేత్రస్థాయిలో క్షుణ్ణంగా పరిశీలించి పారదర్శకంగా విచారణ జరపాలన్నారు. అర్జీలు రీఓపెన్ అయ్యే పరిస్థితి ఉండకూడదన్నారు.

స్పందనలో జెసి సంపత్‌కుమార్, సబ్ కలెక్టర్ అదితిసింగ్

## సమస్యలను త్వరగా పరిష్కరించండి

### మేయర్, కమిషనర్ భాగ్యలక్ష్మి, దినకర్

**ప్రజాశక్తి - విజయవాడ :** స్పందనలో వచ్చిన దరఖాస్తులను త్వరగా పరిష్కరించాలని నగర పాలక సంస్థ మేయర్ రాయన భాగ్యలక్ష్మి, కమిషనర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్ అన్నారు. సమస్యలు పునరావృతం కాకుండా తగిన చర్యలు తీసుకోవాలన్నారు. వీఎంసి ప్రధాన కార్యాలయంలో సోమవారం జరిగిన స్పందన కార్యక్రమంలో వారు పాల్గొని వివిధ సమస్యలపై వచ్చిన 15 ఫిర్యాదులను స్వీకరించారు. వచ్చిన ఫిర్యాదులను సంబంధిత అధికారులకు పంపారు. పట్టణ ప్రణాళిక విభాగం-10, ఇంజినీరింగ్ విభాగం-2, ప్రాజెక్ట్ ఆఫీసర్ (యుసిడి)-2, హార్టికల్చర్ -1కు సంబంధించి విజ్ఞాపన పత్రాలు అందాయి. ఈ కార్యక్రమంలో అడిషనల్ కమిషనర్(ప్రాజెక్ట్స్) కె.వి.సత్యవతి, అడిషనల్ కమిషనర్ (జనరల్) కె.శకుంతల, చీఫ్ మెడికల్ ఆఫీసర్ రత్నావళి, చీఫ్ ఇంజనీర్ ప్రభాకర్ రావు, సిటీ ప్లానర్ జీవీజీఎస్‌వి ప్రసాద్, డిప్యూటీ కమిషనర్ (రెవెన్యూ) వెంకటలక్ష్మి, పిఒ (యుసిడి) రోహిణి, ఏడి హెచ్ శ్రీనివాస్, ఆర్ఎఫ్ఒ వెంకటేశ్వరరావు, ఎస్టేట్ ఆఫీసర్ శ్రీనివాస్, వీఎఎస్ రవిచంద్ పాల్గొన్నారు.

## శాస్త్రీయ విద్య సాధనకు ఉద్యమించాలి

### పిడిఎస్‌యు జాతీయ కన్వీనర్ రామకృష్ణ

**ప్రజాశక్తి - విజయవాడ అర్బన్ :** కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అనుసరిస్తున్న విద్యార్థి వ్యతిరేక విధానాలను ప్రతిఘటించాలని పిడిఎస్‌యు జాతీయ కన్వీనర్ ఎం.రామకృష్ణ పిలుపునిచ్చారు. ప్రగతిశీల ప్రజాస్వామ్య విద్యార్థి సంఘం (పిడిఎస్‌యు) విజయవాడ నగర 9వ మహాసభ ఆదివారం స్థానిక చంద్ర రాజేశ్వరరావు గ్రంథాలయంలో జరిగింది. ఈ మహాసభలో రామకృష్ణ మాట్లాడుతూ విద్యారంగాన్ని మనువాద భావాజాలంతో నింపడానికే నూతన జాతీయ విద్యావిధానం - 2020 తెచ్చిందన్నారు. పిడిఎస్‌యు రాష్ట్ర అధ్యక్షులు యు.గనిరాజు మాట్లాడుతూ విద్యార్థులు చదువుతోపాటు సమాజాన్ని కూడా అర్థం చేసుకోవాలన్నారు. ప్రభుత్వ విద్యారంగాన్ని కాపాడుకోవాలని కోరారు. అనంతరం పిడిఎస్‌యు నగర అధ్యక్షులుగా వైష్ణవ్, వేణుతో పాటు 9మందితో నగర నూతన కార్యవర్గాన్ని ఎన్నుకున్నారు.

**IN THE COURT OF 1 ADDL. JUNIOR CIVIL JUDGE AT VIJAYAWADA**
**O.S. NO. 1570/2021**

Between :
Canara Bank, Nidamanuru Branch, Vijayawada ... Plaintiff
And
Kaluva Kishore Kumar .... Defendant

**Defendant :** Kaluva Kishore Kumar, S/o Late Narshimulu, residing at D.No. 5-50, CSI Church Road, Enikepadu, Vijayawada-521108.

Please take summons that the above suit is filed against you and the same is posted on 21-12-2023 for your appearance.

Therefore you are hereby directed to appear on 21-12-2023 at 10.30 Am either in person or though your advocate before the Hon□ble court and in default the matter will be decided exparte.

**(BY ORDER OF THE HON□BLE COURT)**

**Md.Hayad, B.Com, B.L., Advocate, # 41-9-18, L.R.K. Towers, SF-2, 2nd Floor, Ramalayam Street, Naidupeta, Krishna Lanka, Vijayawada-13.**

### డాక్యుమెంట్స్ పోయినవి

అవనిగడ్డ మండలం, అవనిగడ్డ గ్రామంలోని 4వ వార్డు, డోర్ నెం. 4-83 గృహంలో నివసిస్తున్న గోళ్ళ వసుధరాణి, భర్త : శేషగిరిరావుకు చెందిన పొలం దాక్యుమెంట్ పోయినది. సర్వే నెం. 223/2లో 50 య. సెంట్లకు సంబంధించిన దాక్యుమెంట్ నెం. 941/2002 పోయినది. ఇటీవల కోడూరు మండలం, విశ్వనాధపల్లి గ్రామం నుండి ద్విచక్రవాహనంపై వస్తుండగా మార్గమధ్యంలో పడిపోయినది. ఎవరికైనా దొరికిన యెడల దగ్గరలోని పోలీస్‌స్టేషన్‌లో అప్పగించగలరు. లేదా నా ఫోన్ నెంబర్ 9652305497కు ఫోన్ చేసి చెప్పగలరు.

ఇట్లు
**గోళ్ళ వసుధరాణి, భర్త : శేషగిరిరావు, డోర్ నెం. 4-83, అవనిగడ్డ గ్రామం, అవనిగడ్డ మండలం,. సెల్ : 9652305497**

**మహారాజశ్రీ కొత్తగూడెం ప్రిన్సిపల్ జూనియర్ సివిల్ జడ్జి వారి కోర్టునందు**
**O.S. No.185/2023**

Between:-
జల్లిపల్లి సుబ్బలక్ష్మి ...వాది
మరియు
1)మాగంటి వెంకటలక్ష్మి 2)జంగిలి సత్యవతి
3)మాగంటి రామలక్ష్మి4)మద్దుల సునీత ...ప్రతివాదులు

To,
1)మాగంటి వెంకటలక్ష్మి, భర్త:లేటు బాబురావు, వయస్సు:58 సం॥లు, వృత్తి:గృహిణి, నివాసం:ఇంటి నెం.1-01సి, తాటికాకులగూడెం గ్రామం, జీలుగుమిల్లి మండలం, ప.గో.జిల్లా.
2)జంగలి సత్యవతి, భర్త:సురేష్, వయస్సు: 40 సం॥లు, వృత్తి: గృహిణి, నివాసం: ఇంటి నెం.1-02, తాటికాకులగూడెం గ్రామం, జీలుగుమిల్లి మండలం, ప.గో.జిల్లా.
3)మాగంటి రామలక్ష్మి, భర్త:సిద్ధు, వయస్సు:36 సం॥లు, వృత్తి: గృహిణి, నివాసం:ఇంటి నెం.1-01సి, తాటికాకులగూడెం గ్రామం, జీలుగుమిల్లి మండలం, ప.గో.జిల్లా.
4)మద్దుల సునీత, భర్త:శ్రీనివాస్, వయస్సు: 34 సం॥లు, వృత్తి: గృహిణి, నివాసం: బండివారిగూడెం గ్రామం, జీలుగుమిల్లి మండలం, ప.గో.జిల్లా.

వాది మీపై పైన తెలిపిన దావా దాఖలు చేసియున్నారు. దావాపై మీకు ఎటువంటి అభ్యంతరాలు ఉన్నచో మీరు ది.24-01-2024 తేదిన ఉదయం 10-30 గం॥లకు పైన తెలిపిన కోర్టువారి ఎదుట మీరు స్వయంగా గానీ లేదా మీ ప్లీడర్ గారి ద్వారా గానీ హాజరై అభ్యంతరములు చెప్పుకోగలరు. లేని యెడల మీ పరోక్షములో తీర్మానం చేయబడు తుందని తెలియజేయడమైనది.

**// కోర్టువారి అనుమతితో//**

వాయిదా తేదీ:24-01-2024
కొత్తగూడెం, 09-12-2023

ఇట్లు
**లక్కినేని సత్యనారాయణ, న్యాయవాది-కొత్తగూడెం.**

**IN THE COURT OF THE VII ADDL. DISTRICT JUDGE AT VIJAYAWADA**
**IA.No. 1526 of 2019 IN IA.No. 387 of 2014 IN O.S..No.139 of 2007**

M.Dhanalakshmi (Died) and 3 others .... Plaintiffs
**V/s**
K.Vijaya Lakshmi (Died) and 7 others .... Defendants

**Notice to:**
**R3:** Prabhu Teja Arts, Prop. Shankar, Father's name not known to the plaintiffs. Hindu, aged about 50 years, Gouse Street, Labbipet. (Moghalrajpuram), Vijayawada-10.
**R4:** Kakarla Suvarthamma, W/o. Late Yelisha, Hindu, aged about 48 years, D.No.40-5/8-3, Israilpet, Opp. Telugu Baptist Church. M.G.Road, Vijayawada-10.
**R5:** Kakarla Weshli, S/o. Late Yelisha, Hindu, aged about 25 years, D.No.40-5/8-3, Israilpet, Opp. Telugu Baptist Church, M.G.Road, Vijayawada-10.
**R6:** Kakarla Himakar, S/o. Late Yelisha, Hindu, aged about 24 years, D.No.40-5/8- 3. Israilpet, Opp. Telugu Baptist Church, M.G.Road, Vijayawada-10.
**R7:** Kakarla Haveela, D/o. Late Yelisha, Hindu, aged about 25 years, D.No.40-5/8- 3, Israilpet, Opp. Telugu Baptist Church, M.G.Road, Vijayawada-10.
**(R2 to R7 vacated their tenements, hence no notice needed and taken)**
**R9:** Kota Sudha Jyosthna, W/o. Ravindra, Hindu, R/0.2720, Eleanor way, ellington, FL 33414. (Proposed 9th defendant)
**R10:** Kota Smitha Jyosthna, W/o. Rayudu, Hindu, R/o.2720. Eleanor way, ellington, FL 33414. (Proposed 10th defendant)

You have appear before the Hon'ble court on Dt.25-01-2024 at 10.30 Am, in person or through your advocate, otherwise the petition will be decided in your absence.

**// As per order of the Hon'ble court //**
**G.S.RAMAM**
Petitioners advocate
Vijayawada-3. Cell. 9347312278
Vijayawada Dt.10-12-2023

**IN THE COURT OF THE VII ADDL. DISTRICT JUDGE AT VIJAYAWADA**
**IA.No. 1527 of 2019 IN IA.No. 387 of 2014 IN O.S..No.139 of 2007**

M.Dhanalakshmi (Died) and 3 others .... Plaintiffs
**V/s**
K.Vijaya Lakshmi (Died) and 7 others .... Defendants

**Notice to:**
**R3:** Prabhu Teja Arts, Prop. Shankar, Father's name not known to the plaintiffs. Hindu, aged about 50 years, Gouse Street, Labbipet. (Moghalrajpuram), Vijayawada-10.
**R4:** Kakarla Suvarthamma, W/o. Late Yelisha, Hindu, aged about 48 years, D.No.40-5/8-3, Israilpet, Opp. Telugu Baptist Church. M.G.Road, Vijayawada-10.
**R5:** Kakarla Weshli, S/o. Late Yelisha, Hindu, aged about 25 years, D.No.40-5/8-3, Israilpet, Opp. Telugu Baptist Church, M.G.Road, Vijayawada-10.
**R6:** Kakarla Himakar, S/o. Late Yelisha, Hindu, aged about 24 years, D.No.40-5/8- 3. Israilpet, Opp. Telugu Baptist Church, M.G.Road, Vijayawada-10.
**R7:** Kakarla Haveela, D/o. Late Yelisha, Hindu, aged about 25 years, D.No.40-5/8- 3, Israilpet, Opp. Telugu Baptist Church, M.G.Road, Vijayawada-10.
**(R2 to R7 vacated their tenements, hence no notice needed and taken)**
**R9:** Kota Sudha Jyosthna, W/o. Ravindra, Hindu, R/0.2720, Eleanor way, ellington, FL 33414. (Proposed 9th defendant)
**R10:** Kota Smitha Jyosthna, W/o. Rayudu, Hindu, R/o.2720. Eleanor way, ellington, FL 33414. (Proposed 10th defendant)

You have appear before the Hon'ble court on Dt.25-01-2024 at 10.30 Am, in person or through your advocate, otherwise the petition will be decided in your absence.

**// As per order of the Hon'ble court //**
**G.S.RAMAM**
Petitioners advocate
Vijayawada-3. Cell. 9347312278
Vijayawada Dt.10-12-2023

**IN THE COURT OF THE VII ADDL. DISTRICT JUDGE AT VIJAYAWADA**
**IA.No. 1528 of 2019 IN IA.No. 387 of 2014 IN O.S..No.139 of 2007**

M.Dhanalakshmi (Died) and 3 others .... Plaintiffs
**V/s**
K.Vijaya Lakshmi (Died) and 7 others .... Defendants

**Notice to:**
**R3:** Prabhu Teja Arts, Prop. Shankar, Father's name not known to the plaintiffs. Hindu, aged about 50 years, Gouse Street, Labbipet. (Moghalrajpuram), Vijayawada-10.
**R4:** Kakarla Suvarthamma, W/o. Late Yelisha, Hindu, aged about 48 years, D.No.40-5/8-3, Israilpet, Opp. Telugu Baptist Church. M.G.Road, Vijayawada-10.
**R5:** Kakarla Weshli, S/o. Late Yelisha, Hindu, aged about 25 years, D.No.40-5/8-3, Israilpet, Opp. Telugu Baptist Church, M.G.Road, Vijayawada-10.
**R6:** Kakarla Himakar, S/o. Late Yelisha, Hindu, aged about 24 years, D.No.40-5/8- 3. Israilpet, Opp. Telugu Baptist Church, M.G.Road, Vijayawada-10.
**R7:** Kakarla Haveela, D/o. Late Yelisha, Hindu, aged about 25 years, D.No.40-5/8- 3, Israilpet, Opp. Telugu Baptist Church, M.G.Road, Vijayawada-10.
**(R2 to R7 vacated their tenements, hence no notice needed and taken)**
**R9:** Kota Sudha Jyosthna, W/o. Ravindra, Hindu, R/0.2720, Eleanor way, ellington, FL 33414. (Proposed 9th defendant)
**R10:** Kota Smitha Jyosthna, W/o. Rayudu, Hindu, R/o.2720. Eleanor way, ellington, FL 33414. (Proposed 10th defendant)

You have appear before the Hon'ble court on Dt.25-01-2024 at 10.30 Am, in person or through your advocate, otherwise the petition will be decided in your absence.

**// As per order of the Hon'ble court //**
**G.S.RAMAM**
Petitioners advocate
Vijayawada-3. Cell. 9347312278
Vijayawada Dt.10-12-2023

కరపత్రాలు పంపిణీ చేస్తున్న నాయకులు

## కంకిపాడులో 'బాబు ష్యూరిటీ భవిష్యత్తు గ్యారెంటీ'

ప్రజాశక్తి-కంకిపాడు : కంకిపాడు మండలంలో తుమ్మలపల్లి హరికృష్ణ ఆధ్వర్యంలో బాబు ష్యూరిటీ భవిష్యత్తు గ్యారంటీ కార్యక్రమం కంకిపాడులోని 176,179 బూత్‌లలో సోమవారం నిర్వహించారు. ఈ కార్యక్ర మంలో తెలుగుదేశం నాయకులు కొండా నాగేశ్వరరావు, అన్నవరపు శివపార్వతి, యూనిట్ ఇంచార్జ్ పులి శ్రీనివాసరావు పాల్గొన్నారు.

## దుస్తుల పంపిణీ

ప్రజాశక్తి-గుడివాడ : క్రిస్మస్ కాలం పవిత్రమైందని, ఈ కాలంలో గాయక బృందానికి మెండా కిరణ్‌కుమార్ వితరణతో దుస్తులు పంపిణీ చేయడం అభినందనీయమని అవిలాపూరి చిన్న తేరేజమ్మ దేవాలయం (ఆర్‌సిఎం) విచారణ గురువు ఎం లాయిస్ రాజు అన్నారు. సోమవారం స్థానిక గుడ్‌మెన్‌పేటలోని ఆర్‌సిఎం గుడివాడ-2 చర్చిలో మాలమహానాడు రాష్ట్ర నాయకులు మెండా చంద్రపాల్, మట్టా జాన్ విక్టర్‌లతో కలిసి ఫాదర్ లాయిస్ రాజు మాట్లాడుతూ క్రిస్మస్ పర్వదినాన్ని పురస్కరించుకుని గుడ్‌మెన్‌పేట విచారణ పరిధిదిలోని సుమారు వంద మంది వృద్ధులకు దుస్తులు పంపిణీ చేయటం దేవుని దృష్టిలో గొప్ప కార్యమన్నారు. ఈ కార్యక్రమంలో ఉపదేశులు మేకతోటి మరియదాసు, డి దానియేలు తదితరులు పాల్గొన్నారు.

## బాలికపై వీధికుక్కల దాడి

ప్రజాశక్తి మచిలీపట్నం రూరల్ : మచిలీపట్నం జాలాల్ పేట కు చెందిన ఆరు సంవత్సరాల ఫౌజియా సోమవారం పాఠశాలకు వెళ్లి సాయంత్రం ఇంటికి చేరుకునే సమయంలో జలాల్ పేటలో నరసింహ స్వామి గుడి ముందు వీధి కుక్కల గుంపు దాడి చేసి ఫౌజియాని తీవ్రంగా గాయపరిచాయి. మున్సిపల్ కార్పొరేషన్ వారికి ఎన్ని దఫాలుగా మొరపెట్టుకున్న వీధి కుక్కల నివారణకు ఏ విధమైన చర్యలు తీసుకోకపోవడం లేదని అధికారుల బాధ్యతారాహిత్యానికి ,నిర్లక్ష్యానికి ఈ ఘటన అద్దం పడుతుందని పలువురు అంటున్నారు. వెంటనే మచిలీపట్నంలో ఉన్న వీధి కుక్కలను నివారించాలని కోరుతున్నారు

## పారిశుధ్యాన్ని మెరుగుపరచాలి : జనసేన

ప్రజాశక్తి-అవనిగడ్డ : అవనిగడ్డలో ప్రజలు మురుగు కాలువల మధ్య బతుకులు ఈడుస్తున్నారని వారిని కాపాడాలని జనసేన జిల్లా అధికార ప్రతినిధి రాయపూడి వేణుగోపాలరావు కోరారు. సోమవారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ ఆమనగడ్డ నియోజకవర్గం అవనిగడ్డ ఊరు గొప్ప పేరు దెబ్బగా మారిందన్నారు. .గ్రామపంచాయతీ పరిధిలో ఉన్న ప్రజలు మురుగు కాలువల మధ్య జీవనం సాగిస్తున్నారని, నియోజకవర్గ హెడ్ క్వార్టర్ గా ఉన్న అవనిగడ్డ తుఫాన్లు వచ్చిన ఎండాకాలం అయినా వర్షాకాలం అయిన ముక్కులు మూసుకుపోయే చెడువాసనతో డ్రైనేజీలు ఉండటం విచారకరమన్నారు. అవనిగడ్డ ఇంత దుర్గంధంలో ఉన్న పాలకులలో గాని అధికారుల్లో గానీ చలనం లేదన్నారు.పంచాయతీ పరిధిలోని రెండవ వార్డు సుగాలి కాలనీ లో మురుగునీరు రోడ్లపై ప్రవహిస్తుందన్నారు. మూడో వార్డులోని గుర్రపు చెరువు రోడ్ లో ఐదో వార్డ్ లోనే పోస్ట్ ఆఫీస్ రోడ్డు పరిస్థితి ఇదే విధంగా ఉందని మొత్తంగా పట్టణంలో డ్రైనేజీ వ్యవస్థ అస్తవ్యస్తంగా ఉందన్నారు. పాలకులు ఇప్పటికైనా స్పందించి డ్రైనేజీలు పూడిక తీయించి వెంటనే శానిటేషన్ చేయాలని బ్లీచింగ్ దోమల మందులు కొట్టించాలని డిమాండ్ చేశారు.

# షరతుల్లేకుండా ధాన్యం కొనుగోలు చేయాలి

ప్రజాశక్తి-చల్లపల్లి : మిచాంగ్ తుఫాన్ కారణంగా కురిసిన వర్షాలకు తీవ్రంగా నష్టపోయిన రైతులను ప్రభుత్వం పూర్తిస్థాయిలో ఆదుకోవాలనీ, ఎటువంటి షరతులు లేకుండా ప్రభుత్వ మద్దతు ధరకే ధాన్యం కొనుగోలు చేయాలని మాజీ ఉప సభాపతి మండలి బుద్ధప్రసాద్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. సోమవారం చల్లపల్లి మండలం పాగోలు శివారు మేకావారిపాలెంలో దెబ్బతిన్న వరిపంటను పరిశీలించి రైతులతో మాట్లాడారు. పంట చేతికంది వచ్చే దశలో వస్తున్న తుఫానులు తీవ్ర నష్టాలకు గురిచేస్తున్నాయని రైతులు ఆవేదన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా బుద్ధప్రసాద్ మాట్లాడుతూ పంట నష్టం అంచనాలు రూపొందించి రైతులకు నష్ట పరిహారం ఇవ్వాలని కోరారు. గత ఏడాది ధాన్యం తోలిన రైతులకు ఇంకా రవాణా ఛార్జీలు పూర్తి స్థాయిలో ఇవ్వకపోవటం సిగ్గుచేటని విమర్శించారు. తక్షణమే రవాణా ఛార్జీలను రైతులకు, ధాన్యం తోలిన వాహనదారులకు చెల్లించాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో చల్లపల్లి మండల టీడీపీ ప్రధాన కార్యదర్శి యార్లగడ్డ శ్రీనివాసరావు, గుత్తికొండ వంశీకృష్ణ, వీర్ల మధు, రైతులు మేకా శ్రీనివాసరావు పాల్గొన్నారు.

మొలకెత్తిన ధాన్యాన్ని పరిశీలిస్తున్న మండలి బుద్ధప్రసాద్

# కపిలేశ్వరపురంలో పంటపొలాల పరిశీలన

పంటలు పరిశీలిస్తున్న వర్ల కుమార్ రాజా తదితరులు

ప్రజాశక్తి-పమిడిముక్కల : ఇటీవల తుఫా నుకు రైతులకు నష్టం జరిగిందని ధాన్యాన్ని ప్రభుత్వం కొనుగోలు చేయాలని పామర్రు తెలుగుదేశం పార్టీ ఇంచార్జ్ వర్ల కుమార్ రాజా అన్నారు. సోమవారం కపిలేశ్వరపురంలోని పంట పొలాలను పరిశీలించి మాట్లాడారు. రైతుకు చేతికి అందించిన పంట తుఫాను తాకిడితో తీవ్రంగా నష్టపోయారని, సబ్సిడీ విత్తనాలు క్రాఫ్ ఇన్సూరెన్స్ ఇవ్వాలని డిమాండ్ చేశారు. అనంతరం తహసీల్దార్‌కు వినతిపత్రం అందించారు. మండల పార్టీ అధ్యక్షులు రాజులపాటి శ్రీనివాసరావు, మై నేమ్ నరేంద్ర ,గంటా సురేష్, గురువిందపల్లి శ్రీనివాసరావు, తోడేటి ముత్తయ్య తదితరులు పాల్గొన్నారు.

**పమిడిముక్కలలో పల్లెకు పోదాం**

వైయస్ జగన్మోహన్‌రెడ్డి ప్రభుత్వం సంక్షేమ ప్రభుత్వం అని మండల ఉపాధ్యక్షులు కొడమంచిలి మహేష్, గంజాల సీతా రామయ్య అన్నారు. సోమవారం పమిడి ముక్కలలో పల్లెకు పోదాం కార్యక్రమంలో నిర్వహించారు. ఈసందర్భంగా ఇంటింటికి తిరిగి సంక్షేమ పథకాలు వివరించారు. ఈకార్యక్రమంలో మండల వైయస్సార్ పార్టీ నాయకులు ఎలమంచిలి గణేష్, పాతూరి చంద్రపాల్, గురువిందపల్లి వంశీ, మైనేని కోటేశ్వరావు, పంచాయతీ కార్యదర్శి సుధాకర్ తదితరులు పాల్గొన్నారు.

# రైతులకు సేవలందించడం అభినందనీయం: వంశీ

ప్రజాశక్తి హనుమాన్‌జంక్షన్: రైతులకు అన్నివిధాలుగా సేవలందించడంతోపాటు స్థానిక ప్రజలకు కూడా పీఏసీఎస్ ద్వారా సేవలందించడం అభినందనీయమని ఎమ్మెల్యే వంశీ అన్నారు. తిప్పనగుంట శ్రీసీతా రామాంజనేయ పీఏసీఎస్ ద్వారా హరిజనవాడకు వితరణ చేసిన 90వేల విలువగల ఫ్రీజర్బాక్సు సోమవారం పీఏసీఎస్ అధ్యక్షుడు మూల్పూరు ప్రభుకాంత్‌తో కలిసి హరిజనవాడ వాసులకు ఆయన అందజేశారు. ప్రజాసేవార్థం గతంలో మంచినీటి ట్యాంకర్ ను అందజేయడం జరిగిందని, సహకార సంఘ సామాజిక నిధుల నుండి ఫ్రీజర్బాక్సు అందజేశామని అధ్యక్షుడు ప్రభుకాంత్ వివరించారు. మొవ్వా శంకరరావు, కోలవెం టి సుబ్బారావు, తొమ్మండ్రు రామారావు, ఐజాక్, మొవ్వా మహేష్ పాల్గొన్నారు.

## పంట నష్టం అంచనా నమోదు

ప్రజాశక్తి-ఘంటసాల : మిచౌంగ్ తుఫాను కారణంగా కురిసిన వర్షాలకు ఘంటసాల మండలంలోని వరి పంట నష్టపోయిన రైతుల వివరాలను తుది జాబితా సోమవారం నుంచి వ్యవసాయ శాఖ వారు రూపొందిస్తున్నారు. మండలంలోని 21 రెవెన్యూ గ్రామాల్లో 5855 ఎకరాల్లో క్రాఫ్ డ్యామేజీ అయినట్లు ప్రాథమిక అంచనాలు రూపొందించామని, దాని ఆధారంగా తుది జాబితాను సిద్ధం చేస్తున్నట్లు మండల వ్యవసాయ శాఖ అధికారి కె.మురళీకృష్ణ తెలిపారు. వీఆర్వో, విఏఏలతో పంట నష్టం వివరాలు నమోదు చేసి తుది జాబితా తయారు చేస్తామని తెలిపారు. ఈ నెల 18వ తేదీలోగా జాబితాను సిద్ధం చేసి రైతు భరోసా కేంద్రాల్లోని నోటీసు బోర్డులో ప్రదర్శిస్తామని తెలిపారు. అభ్యంతరాలు ఏమైనా ఉంటే ఈ నెల 22 లోపు గ్రీవెన్స్ తీసుకుంటామని, రైతులు పట్టాదారు పాస్ పుస్తకం, ఆధార్ కార్డు నకళ్లను విఏఏకు సమర్పించాల్సి ఉంటుందని ఆయన తెలిపారు. ఈ-క్రాప్ లో నమోదైన వారి వివరాల ఆధారంగా తుది అంచనా నమోదు ఈ నెల 26వ తేదీన తుది జాబితా కలెక్టర్ కు అందజేస్తామని తెలిపారు.

## అవకతవకలు లేకుండా పంట నష్టం నమోదు చేయాలి

ప్రజాశక్తి-మొవ్వ : మిచౌంగ్ తుఫాను వల్ల మొవ్వ మండలంలో నష్టపోయిన పంటను క్షేత్రస్థాయిలో సర్వే చేసి ఏ విధమైన అవకతవకలు లేకుండా నమోదు చేయాలని మండల తాసిల్దార్ సిహెచ్ వీరాంజనేయ ప్రసాద్, వ్యవసాయ అధికారి కంచర్ల శివప్రసాద్ ఆదేశించారు. మండలంలోని వీఆర్వోలకు, విఏఏలకు సోమవారం తాసిల్దార్ కార్యాలయంలో సమావేశం నిర్వహించి పలు సూచనలు ఇచ్చారు. క్షేత్రస్థాయిలో మండలంలోని పొలాలను సందర్శించి ముంపుపాలై కోత కోయని పొలాలను సర్వే చేసి నమోదు చేయాలని ఆదేశించారు. కోత కోయని 33 శాతం నష్టం పైగా నష్టపోయిన పంట పొలాలను క్షేత్రస్థాయిలో పరిశీలించి 33 అంశాల ప్రొఫార్మాలో పూర్తి చేయాలని సూచించారు. వర్షాలకు తడిసిన పనల మీద ఉన్న వరిపైరునుకూడా ప్రత్యేక లిస్టు తయారు చేయాలని ఆదేశించారు.

## భారీకేడ్లను తొలగించాలని వినతి

ప్రజాశక్తి మచిలీపట్నం రూరల్ : మచిలీపట్నం నగరపాలక సంస్థ పరిధిలోని రాజా గారి సెంటర్ నాలుగు రోడ్ల కూడలిని మూసి వేస్తూ ఏర్పాటు చేసిన భారీ కేడ్లను తొలగించాలని జనసేన పార్టీ ఇంచార్జ్ బండి రామకృష్ణ సోమవారం జిల్లా కలెక్టర్ మరియు జిల్లా ఎస్పీకి వినతిపత్రం సమర్పించారు. అధికారులు వెంటనే స్పందించి ప్రజల రాకపోకల సౌకర్యార్థం గతంలో వలె ట్రాఫిక్ పోలీసులను నియమించి అడ్డుగా ఉన్న బారికేడ్లను తొలగించి ప్రధాన రహదారి అయిన వల్లూరి రాజా గారి సెంటర్ కూడలి ప్రజల సౌకర్యార్థం తిరిగి యథాస్థితి కల్పించాలని వినతిపత్రంలో రామకృష్ణ కోరారు. ఆయనతోపాటు మాజీ మంత్రి కొల్లు రవీంద్ర, జనసేన పార్టీ నగర అధ్యక్షుడు గడ్డంరాజు, జిల్లా ఉపాధ్యక్షుడు వంపు గడవల చౌదరి తదితరులు పాల్గొన్నారు.

## నాడు-నేడు పనులపై విచారణ జరపాలని వినతి

ప్రజాశక్తి-మోపిదేవి : పాఠశాలల అభివృద్ధి అంటూ చేపడుతున్న నాడు-నేడు పనులు వైసిపి కార్యకర్తలు జేబులు నింపుకోవడానికి దోహదపడుతున్నాయని మోపిదేవి మండల పరిషత్ కో ఆప్షన్ నెంబర్ చందన రంగారావు ఆరోపించారు. మోపిదేవి మండలం కొత్తపాలెం జిల్లా పరిషత్ హై స్కూల్ లో ఇనుము సిమెంటు మాయం అవటం మళ్లీ అధికారులు తనిఖీలకు వచ్చేసరికి కొంత సిమెంటు కొంత ఇనుము పాఠశాలలో ప్రత్యక్షం అవ్వడం అనేక అనుమానాలకు దారితీస్తుందని, దీనిపై సమగ్ర విచారణ జరిపి ప్రభుత్వం నిధులు దుర్వినియోగం కాకుండా చూడాలని సోమవారం జిల్లా కలెక్టర్ కార్యాలయంలో స్పందనలో వినతిపత్రం సమర్పించారు. గత ఏడాది నుంచి సాగుతున్న పనులు ఇప్పటికీ ఓ కొలిక్కి రాక విద్యార్థులు నానా ఇబ్బందులు పడుతున్నారు పదో తరగతి గదుల్లో తీసిన పాత నాపరాయి ఏమైందో ఎక్కడికి తరలించారు అనే విషయాలపై విచారణ జరిపించాలని ఈ సందర్భంగా అధికారులు కు విజ్ఞప్తి చేశారు.

## ముక్తేశ్వరాలయంలో దీపారాధన

స్వామివారిని దర్శించుకున్న అడుసుమిల్లి సుబ్రహ్మణ్యం, అనురాధ దంపతులు

ప్రజాశక్తి హనుమాన్ జంక్షన్ : కార్తీకమాస సోమవారం సందర్భంగా పెరికీడులోని శ్రీ ముక్తి కాంతా సమేత ముక్తేశ్వరాలయంలో దశసహస్ర దీపారాధన విశేషపూజ నిర్వహించారు. దీపక్ నెక్స్ జెన్ ఫీడ్స్ ఎండీ అడుసుమిల్లి సుబ్రహ్మణ్యం, అనురాధ దంపతులు ప్రత్యేకంగా ఏర్పాటు చేసిన వేదికపై స్వామి వారికి విశేషపూజలు నిర్వహించి దీపాలంకరణసేవలో తొలిదీపాన్ని వెలిగించారు. మహిళలు కోలాటం తో స్వామివారిని పల్లకిలో మోసుకువచ్చారు. అర్చకులు కుందుర్తి శ్యామ్, సీతారామయ్య, ఆధ్వర్యంలో ముక్తేశ్వరుని నక్షత్రహారతి నిర్వహించారు. దశసహస్రదీపారాధనకు సహకారం అందించిన దాత సుబ్రహ్మణ్యం దంపతులను కమిటీ సభ్యులు నందూరి శర్మ, రంగారావు, సత్కరించారు. ఈ దీపోత్సవ కార్యక్రమాన్ని చూసి తరించేందుకు చుట్టు పక్కల గ్రామాల నుంచి భక్తులు తరలివచ్చారు.ముక్తి కాంత సమేత ముక్తేశ్వర స్వామి ఆలయ కమిటీ నిర్వాహకులు ఏర్పాట్లను పర్యవేక్షించారు.

## కిటకిటలాడిన శివాలయం

ప్రజాశక్తి పెడన : శ్రీ గంగా పార్వతి సమేత అగస్త్యేశ్వరస్వామి (శివాలయం) దేవాలయంలో అయ్యప్ప స్వామి శివుని నామస్మరణలతో మార్మో గింది. కార్తీక మాసం చివరి సోమ వారం కావడంలో వేకువ జామునుంచే భక్తులతో కిటకిటలాడింది. మహిళ భక్తులు దీపాలు వెలిగించి ధీపధూప నైవేద్యాలతో స్వామివారికి పూజలు నిర్వహించారు.అంతేకాకుండా పట్టణంలోని పలు అయ్యప్ప మాల ధరించిన భక్తులతో ఇరుముడులు చేశారు. వేలాది మంది భక్తులతో ఆలయ ప్రాంగణం అయ్యప్ప, శివుని నామాలతో భజనలు చేశారు.ఆలయ ఈ ఓ టిక్కిశెట్టి వీర వెంకట రామ్మోహనరావు భక్తులకు అసౌకర్యం కలగకుండా జాగ్రత్తలు తీసుకున్నారు.

## దుప్పట్లు పంపిణీ

ప్రజాశక్తి-చల్లపల్లి చల్లపల్లి పాత్రికేయులు ఐక్యం ఫౌండేషన్ ఆధ్వర్యంలో ఆదివారం రాత్రి చల్లపల్లిలో నిరాశ్రయులకు చలి నుంచి రక్షణ అందించేందుకు దుప్పట్లు అందచేశారు. శివాలయం సెంటర్, బస్టాండ్, పాత మరుగుదొడ్లు, సబ్ స్టేషన్ పక్కన మురికివాడ, కోమలా నగర్ మురికివాడల్లో, రోడ్డు పక్కన జీవిస్తున్న 50మంది నిరాశ్రయులకు దుప్పట్లు కప్పారు. ఈ కార్యక్రమాన్ని ఐక్యం ఫౌండేషన్ ప్రతినిధులు కిరణ్ ఆకురి శ్వేతకస్తూరి విజయ్, చల్లపల్లి ప్రెస్ క్లబ్ అధ్యక్షులు పేరం మధుసూధనరెడ్డి నిర్వహించారు.

# మంచినీటి కోసం నిరసన

వైఎస్సార్ కాలనీలో నిరసన తెలుపుతున్న ప్రజలు

**ప్రజాశక్తి-భవానీపురం:** కృష్ణా నదికి కూతవేటు దూరంలో వున్న జక్కంపూడి వైఎస్ఆర్ కాలనీలో గత కొతకాలంగా మంచినీరు సరఫరా గాకపోవటంతో స్థానికులు పలు ఇబ్బందులకు గురవుతున్నారు. విషయం తెలుసుకున్న సిపిఎం పశ్చిమ సిటీ కార్యదర్శి, కార్పొరేషన్ సిపిఎం పార్టీ ఫ్లోర్‌లీడర్ బోయి సత్యబాబు సోమవారం వైఎస్ఆర్ కాలనీని సందర్శించారు. అనంతరం సిపిఎం పార్టీ ఆధ్వర్యంలో స్థానికులతో కలిసి సచివాలయం వద్ద నిరసన కార్యక్రమం నిర్వహించారు. అనంతరం సత్యబాబు మాట్లాడుతూ వైయస్సార్ కాలనీలో గత వారం రోజులుగా మంచినీరు ప్రజలకు అందక తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని తెలిపారు. కృష్ణా నదికి దగ్గరలోనే నివసిస్తున్న వారికి మంచినీరు సరఫరా కాకపోవటం బాధాకరమన్నారు. అన్ని రకాల పన్నులు వసూలు చేయటంలో ముందుండే ప్రభుత్వ అధికారులు ప్రజల ఇబ్బందులు తీర్చడంలో అలసత్వం వహించటంపై సత్యబాబు మండిపడ్డారు. వెంటనే సంబంధిత అధికారులు మంచినీటి సరఫరాలో ఇబ్బందులు తొలగించాలని డిమాండ్ చేశారు. అంతేగాక పాడైపోయిన బోరింగ్ పంపులను బాగుచేసి అదుబాటులోకి తేవాలని కోరారు. ఈ కార్యక్రమంలో సిపిఎం నాయకులు కే. సూరిబాబు, కే. రవి స్వామి, వీరయ్య , శ్రీలక్ష్మి, మౌనిక, స్వర్ణలత, శశికుమార్, విజయ తదితరులు పాల్గొన్నారు.

## స్పందనలో మంచినీటి సమస్యపై వినతి

**ప్రజాశక్తి-విజయవాడ:** స్థానిక 50 డివిజన్‌లోని మహంతిపురం ప్రాంతంలో కలుషిత మంచినీటి సరఫరాతో ప్రజలు పలు రకాల అనారోగ్య సమస్యలకు గురిఅవుతూ, తీవ్ర భయాందోళన చెందుతున్నారని సిపిఎం ఫ్లోర్‌లీడర్ బోయి సత్యబాబు అన్నారు. మహంతిపురం ప్రాంత ప్రజలకు కలుషితం లేని మంచి నీటిని సరఫరా చేసే విధంగా చర్యలు తీసుకోవాలని స్పందన కార్యక్రమం సందర్భంగా నగర కమిషనర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్‌కు బోయి సత్యబాబు సోమవారం వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా బోయి సత్యబాబు మాట్లాడుతూ... మహంతిపురం ఏరియాలో కలుషితమైన నీటినే స్థానిక ప్రజలు తాగాల్సి వస్తోందని అన్నారు. దీని వల్ల ఆ ప్రాంతంలో పలు రకాల అనారోగ్య సమస్యలు ఎదురవుతున్నాయని అన్నారు. ఇటువంటి పరిస్థితుల్లో వెంటనే వాటర్‌ను ల్యాబ్ ద్వారా టెస్టింగ్ చేయించి, ప్రజల భయాందోళనను తొలగించాలని కోరారు. అదే విధంగా సప్లై అవుతున్న వాటర్ స్థానిక ప్రజలకు సరిపోవడం లేదని అన్నారు. ప్రజలందరి వినియోగానికి అవసరమైన విధంగా వాటర్ సప్లై పెంచి ,వాటర్ విడుదల చేయాలని కోరారు. దీనిపై కమిషనర్ స్పందిస్తూ కలుషితమైన వాటర్ గురించి అధికారులను అప్రమత్తం చేసి, తగిన చర్యలు తీసుకోవడం జరుగుతుందని హామీనిచ్చారు.

## బాక్సింగ్ క్రీడాకారుల ఎంపిక

**ప్రజాశక్తి-ఇబ్రహీంపట్నం:** స్థానిక ఆర్కే కాలేజ్ ఆఫ్ ఇంజినీరింగ్ నందు సోమవారం జేఎన్ టియూకే కాకినాడ సెంట్రల్ జోన్ అంతర్ కళాశాలల బాక్సింగ్ సెలక్షన్స్ నిర్వహించారు. ఈ కార్యక్రమంలో వివిధ జిల్లాల నుండి దాదాపు 30 మంది విద్యార్థులు బాక్సింగ్ క్రీడాకారులు పాల్గొన్నారు. ఈ కార్యక్రమాన్ని కళాశాల ప్రిన్సిపల్ మరియు జేఎన్టీయూకే స్పోర్ట్స్ కౌన్సిల్ మెంబర్ డాక్టర్ పి రాజు ప్రారంభించారు. ఈ సందర్భాన్ని పురస్కరించుకొని జెఎన్టియుకే స్పోర్ట్స్ కౌన్సిల్ మెంబర్ డాక్టర్ పి రాజు మాట్లాడుతూ యూనివర్సిటీ వారికి గత 12 సంవత్సరాలుగా సహకరిస్తున్నందుకు కళాశాల యాజమాన్యం వారికి కృతజ్ఞతలు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ కే రామకృష్ణయ్య, కళాశాల పీడీ వి మురళీనాథ్, స్పోర్ట్స్ కౌన్సిల్ మెంబర్ బాలశౌరి పాల్గొన్నారు.

## రేపు సీనియర్ రెసిడెంట్ పోస్టుల భర్తీకి ఇంటర్వ్యూలు

**ప్రజాశక్తి-హెల్త్ యూనివర్సిటీ:** విజయవాడలోని ప్రభుత్వ సిద్ధార్థ వైద్య కళాశాలలో సీనియర్ రెసిడెంట్ పోస్టుల భర్తీకి వాకిన్ ఇంటర్వ్యూలు నిర్వహించనున్నట్లు కళాశాల ప్రిన్సిపల్ డా. కంచర్ల సుధాకర్ తెలిపారు. ఈ మేరకు సోమవారం ఓ ప్రకటనలో పేర్కొన్నారు. ఈ నెల 13వ తేదీన ఉదయం 10 గంటల నుంచి సాయంత్రం 4 గంటల వరకు వాకిన్ ఇంటర్వ్యూలు నిర్వహించనున్నట్లు తెలిపారు. అభ్యర్థులు పూర్తి వివరాలకు https://www.smcvja.in వెబ్‌సైట్‌ను సందర్శించాలని సూచించారు. సీనియర్ రెసిడెంట్ల నియామకంతో ప్రభుత్వ సాధారణ ఆసుపత్రిలో వైద్య సేవల విస్తరణ జరగనుందని పేర్కొన్నారు. రోగులకు మరింత మెరుగైన సేవలు అందుబాటులోకి రానున్నట్లు ప్రిన్సిపల్ సుధాకర్ అన్నారు.

## విజయవాడలో 'తికమక తండా' సందడి

**ప్రజాశక్తి-ఎడ్యుకేషన్:** విజయవాడలో తికమక తండా చిత్ర యూనిట్ సందడి చేసింది. కామెడీ జోనర్ తో తీసిన ఈ చిత్రాన్ని ప్రేక్షకులు తప్పక ఆదరించాలని ఈ సందర్భంగా యువ నటులు హీరో రామ్, హరి కోరారు. సోమవారం ఆంధ్ర లయోలా కళాశాలలో విజువల్ కమ్యూనికేషన్స్ విద్యార్థులతో తిక మక తండా చిత్ర యూనిట్ ముచ్చటించింది. చిత్రానికి సంబంధించిన విశేషాలను విద్యార్థులకు వివరించారు. ఈ సందర్భంగా విద్యార్థుల సమక్షంలో ట్రైలర్, వీడియో పాటలను రిలీజ్ చేశారు. ఈ సందర్భంగా హీరోలు రామ్, హరి మాట్లాడుతూ తిక మక తండా చిత్రం పూర్తిస్థాయి వినోదాత్మక చిత్రమని, అలాగే ఈ సినిమాలోని సన్నివేశాలు నిజ జీవితానికి దగ్గరగా ఉంటాయని తెలిపారు. అనంతరం రాజన్న ఫెమ్ ఆని, స్కంద ఫెమ్ రేఖా నిరోషా మాట్లాడుతూ పలు చిత్రాలలో చైల్డ్ ఆర్టిస్ట్‌గా నటించామని హీరోయిన్లుగా తొలిసారి వెండితెరకు పరిచయమవుతున్నామని ప్రేక్షకులు ఈ చిత్రాన్ని వీక్షించి విజయవంతం చేయాలని వారు కోరారు. ఈ కార్యక్రమంలో లయోలా కళాశాల పూర్వ విద్యార్థి ప్రదీప్ ఫార్చ్యూ ఫౌండర్ ప్రదీప్, కళాశాల ప్రిన్సిపల్ కిషోర్ వైస్ ప్రిన్సిపల్ రాయప్ప, చిత్ర నిర్మాత తిరుపతి శ్రీనివాస్ పాల్గొన్నారు.

# నేటి నుంచి అండర్-19 జాతీయ బ్యాడ్మింటన్ పోటీలు

**ప్రజాశక్తి-ఎడ్యుకేషన్:** విజయవాడ వేదికగా అండర్-19 బ్యాడ్మింటన్ జాతీయ టోర్నమెంటు నిర్వహనకు అవకాశం లభించిందని.. ఈ టోర్నీని విజయవంతంగా నిర్వహించేందుకు ప్రత్యేక కమిటీలు బంద స్ఫూర్తి, సమన్వయంతో పనిచేస్తున్నట్లు ఏపీ స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ కార్యదర్శి జి.భానుమూర్తి రాజు తెలిపారు. ఈ నెల 12వ తేదీ నుంచి 16 వరకు పటమటలోని సీఆర్ఎంసీ ఇండోర్ స్టేడియంలో జరగనున్న అండర్-19 (బాలురు, బాలికలు) జాతీయ బ్యాడ్మింటన్ టోర్నమెంటు నిర్వహణపై పీబీ సిద్ధార్థ జూనియర్ కళాశాలలో ఏపీ స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ కార్యదర్శి జి.భానుమూర్తి రాజు, టోర్నమెంటు కన్వీనర్ సి.శివ సత్యనారాయణరెడ్డి, టోర్నీ ఆర్గనైజింగ్ సెక్రటరీ వి.రవికాంత, పీబీ సిద్దార్ధ జూనియర్ కళాశాల ప్రిన్సిపల్ సీహెచ్ వెంకటేశ్వర్లు తదితరులు సోమవారం మీడియా సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో ఏపీ స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ కార్యదర్శి జి.భానుమూర్తి రాజు మాట్లాడుతూ 25 రాష్ట్రాలు, 8 కేంద్రపాలిత ప్రాంతాల నుంచి 33 టీమ్స్ పోటీల్లో పాల్గొననున్నట్లు తెలిపారు. 164 మంది బాలురు, 161 మంది బాలికలు మొత్తం 325 మంది క్రీడాకారులతో పాటు 100 మంది టెక్నికల్ సిబ్బందికి అవసరమైన భోజన, వసతి, రవాణా తదితర సౌకర్యాలు ఏర్పాటు చేసినట్లు వివరించారు. టోర్నమెంటుకు నేషనల్ అబ్జర్వర్‌గా యూపీకి చెందిన రాజు రాణా హాజరుకానున్నట్లు తెలిపారు. టోర్నమెంట్ కన్వీనర్ శివ సత్యనారాయణరెడ్డి మాట్లాడుతూ ప్రారంభోత్సవ కార్యక్రమాన్ని సిద్దార్ధ ఆర్ట్స్ అండ్ సైన్స్ కళాశాల క్రీడామైదానంలో డిసెంబర్ 12వ తేదీ మంగళవారం సాయంత్రం 4 గంటలకు ఘనంగా నిర్వహించేందుకు ఏర్పాట్లు చేసినట్లు తెలిపారు. సమావేశంలో ఏపీ స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ సహాయ కార్యదర్శి కేవీ రాధాకష్ణ, టోర్నీ ఆర్గనైజింగ్ సెక్రటరీ వి.రవికాంత, పీబీ సిద్దార్ధ జూనియర్ కళాశాల ప్రిన్సిపల్ సీహెచ్ వెంకటేశ్వర్లు, టెక్నికల్ మేనేజర్ జిలానీ పాల్గొన్నారు.

# సర్వీసుల క్రమబద్ధీకరణకు కృషి : కాకర్ల

**ప్రజాశక్తి-విజయవాడ**

రాష్ట్ర వ్యాప్తంగా వివిధ ప్రభుత్వ శాఖల్లో ఎన్ఎంఆర్/ మినిమం టైం స్కేల్, ఫుల్ టైం- పార్ట్ టైం కంటిన్యూజెంట్ ఎంప్లాయిస్‌గా 1993 నవంబర్ 25కు ముందు నియమింపబడి, విధులు నిర్వహిస్తున్న వారి సర్వీస్‌లను క్రమబద్ధీకరించే విధంగా ప్రభుత్వంతో చర్చించాలని ఎన్ఎంఆర్, మినిమం టైం స్కేల్ ఎంప్లాయిస్ అసోసియేషన్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కే శ్రీనివాస్ కోరారు. ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వ ఉద్యోగుల ఫెడరేషన్ రాష్ట్ర అధ్యక్షులు కాకర్ల వెంకటరామిరెడ్డికి విజయవాడ నగరపాలక సంస్థ ప్రధాన కార్యాలయంలో శ్రీనివాస్ నేతృత్వంలో సంబంణతీత ఉద్యోగులు సోమవారం వినతిపత్రం అందజేశారు. రాష్ట్ర ప్రభుత్వం వద్ద ఎం ఎం ఆర్, మినిమం టైమ్స్ ఎంప్లాయిస్ సర్వీస్ లను క్రమబద్ధీకరించే విధంగా ప్రభుత్వంపై వత్తిడి తీసుకొచ్చి తగు చర్యలు చేపడతానని వెంకటరామిరెడ్డి ఉద్యోగులకు హామీనిచ్చారు.విజయవాడ నగరపాలక సంస్థ ప్రధాన కార్యాలయం లో నగరపాలక సంస్థ కమిషనర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్ ఆధ్వర్యంలో నిర్వహించిన స్పందన కార్యక్రమంలో నగరపాలక సంస్థ ఎంప్లాయిస్ సమస్యలపై వెంకటరామిరెడ్డి పాల్గొని కమిషనర్‌కు వినతి పత్రం ఇచ్చి చర్చించారు.ఈ సందర్భంగా కె.వెంకటరామిరెడ్డి మాట్లాడుతూ రాష్ట్రవ్యాప్తంగా ఎన్ ఎమ్ ఆర్, మినిమం టైమ్ స్కేల్ ఎంప్లాయిస్ సర్వీస్ లను రాష్ట్ర ప్రభుత్వం వెంటనే క్రమబద్ధీకరించే విధంగా తన వంతుగా కషి చేస్తానని అన్నారు.రాష్ట్ర ప్రభుత్వం వద్ద జరిగే చర్చల సందర్భంగా సర్వీస్ క్రమబద్ధీకరణ సమస్యను రాష్ట్ర ముఖ్యమంత్రి , మంత్రివర్గ ఉప సంఘ కమిటీ ప్రతినిధులు దృష్టికి, ఉన్నతాధికారుల దృష్టికి తీసుకువెళ్లి కృషి చేస్తానని హామీనిచ్చారు. అనంతరం ఉద్యోగులు వెంటకరామిరెడ్డిని సత్కరించారు. ఈ కార్యక్రమంలో ఆంధ్రప్రదేశ్ ఎన్.ఎం.ఆర్ /మినిమం టైం స్కేల్ /ఫుల్ టైం- పార్ట్ టైం కంటిన్యూజెంట్ ఎంప్లాయిస్ అసోసియేషన్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కే శ్రీనివాస్, రాష్ట్ర కార్యవర్గ సభ్యులు, ఏపీ మున్సిపల్ మినిమం టైమ్ స్కేల్ ఎంప్లాయిస్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి బొజ్జ సుబ్బారావు ,రాష్ట్ర కోశాధికారి ఎస్ రఘునాథ్, రాష్ట్ర కమిటీ సభ్యులు కే పున్నారావు, పీ పరశురాములు, నగర పాలక సంస్థ ఎన్.ఎం.ఆర్ అసోసియేషన్ నాయకులు ఏ రామ్మోహన్, అన్నవరపు సుబ్బారావు, ఎం సత్యానందం ,టీవీఎస్ శ్రీనివాసరావు ,పి ప్రభాకర్ రావు, వై శ్రీనివాసరావు, అప్పల్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

విఎంసిలో వెంకటరామిరెడ్డిని శాలువాతో సత్కరిస్తున్న ఉద్యోగులు

## కరాటే పోటీల్లో విద్యార్థుల ప్రతిభ

**ప్రజాశక్తి-తిరువూరు :** జాతీయస్థాయి కుంగ్ ఫూ అండ్ కరాటే చాంపియన్ షిప్ పోటీలో తిరువూరుకు చెందిన హర్ష కరాటే స్కూల్ విద్యార్థులు అత్యంత ప్రతిభ కనబర్చారు. ఈ నెల 10న నందిగామ పట్టణంలో చైనీస్ కుంగ్‌ఫూ జాతీయస్థాయి కుంగ్ ఫూ అండ్ కరాటే ఛాంపియన్ షిప్ పోటీలు నిర్వహించినట్లు కోచ్ ఎం.నాగేశ్వరరావు తెలిపారు. ఛాంపియన్ కుమటీ విభాగంలోని జూనియర్స్ విభాగంలో తమ విద్యార్థులు అత్యంత ప్రతిభ కనబర్చి ఆరు స్వర్ణ పతకాలు సాధించారని అయన చెప్పారు.

## సంక్షేమ పథకాల బోర్డు ఆవిష్కరణ

**ప్రజాశక్తి-విజయవాడ:** స్థానిక 33 వ డివిజన్ సత్యనారాయణపురంలోని 218 వ వార్డు సచివాలయ పరిధిలో సోమవారం జరిగిన 'వై ఏపీ నీడ్స్ జగన్' కార్యక్రమంలో స్థానిక కార్పొరేటర్ శర్వాణి మూర్తితో కలిసి ఎమ్మెల్యే మల్లాది విష్ణు పాల్గొన్నారు. తొలుత పార్టీ జెండాను ఎగురవేశారు. అనంతరం సంక్షేమ, అభివద్ధి కార్యక్రమాల బోర్డును ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ... రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా ప్రవేశపెట్టిన గ్రామ/ వార్డు సచివాలయ వ్యవస్థ చిట్టచివరి గడప వరకు చేరువైందని.. ప్రతి కుటుంబంలోనూ ఒక భాగంగా మారిందని అన్నారు. వాలంటీర్, సచివాలయ వ్యవస్థలతో ప్రజలకు సేవలు సులభతరమయ్యాయని.. 98 శాతం మంది నియోజకవర్గ ప్రజలు ఈ వ్యవస్థ పట్ల సంతప్తి వ్యక్తం చేస్తున్నట్లు చెప్పారు. ఈ కార్యక్రమంలో నాయకులు దోనేపూడి శ్రీనివాస్, లంకా బాబు, కమ్మిలి రత్న, ఉప్పు రంగబాబు, ఎన్.రవిశంకర్ తదితరులు పాల్గొన్నారు.




ప్రజాశక్తి
ప్రతి అక్షరం... ప్రజల పక్షం

పుట్టినరోజు, వివాహ వేడుక, పదవీ విరమణ, జయంతి, వర్ధంతి, శ్రద్ధాంజలి మరియు లీగల్ మొదలగు అన్నిరకాల ప్రకటనలకై...

మీ బంధు మిత్రులకు తక్కువ సమయంలో సమాచారం తెలపాలంటే తక్కువ ఖర్చుతో ప్రకటనలకై మీ సమీపంలోని ప్రజాశక్తి కార్యాలయంలో గానీ లేదా క్రింది నెంబర్‌కు గానీ సంప్రదించగలరు.
సెల్ నెం: 94900 99530, 94900 99218

విజ్ఞప్తి
స్థానిక వార్తలతో పాటు, జాతీయ, అంతర్జాతీయ వార్తలు, విశ్లేషణల సమాహారం... ప్రజాశక్తి. చందా దారులుగా చేరండి.
94900 99218, 9490099530 నెంబర్లను సంప్రదించండి.